

بسم الله الرحمن الرحيم
وَمَنْ يَّعْصِ اللّٰهَ وَرَسُوْلَهٗ فَاِنَّ لَهٗ نَارَ جَهَنَّمَ خٰلِدِيْنَ فِيْهَآ اَبَدًا
ప్రవక్త ముహమ్మద్ (స.అ.స.)
బాట స్వర్గానికి బాట
ناشر بہادر
BAHADUR...

## ہماری چند اہم مطبوعات    ناشر بہادر

نمازِ نبوی ﷺ (تلگو، انگریزی ہندی)

ماثورہ دُعائیں (تلگو، انگریزی)

کتابُ التوحید (تلگو)

اسلام پر غیر مسلمین کے چند سوالات کے جوابات (تلگو)

رسول اللہ ﷺ کا راستہ ہی جنت کا راستہ ہے۔ (تلگو)

یہی لوگ جنتی ہیں (تلگو)

قرآن اور سائنس (تلگو)

اسلامی مہینوں کی فضیلتیں اور بدعتیں۔ (تلگو)

زیرِ جمعیت الشبان اہلحدیث وشاکھاپٹنم

JAMIATH SHUBBAN AHL-E-HADEES

QURAAN & HADEES

ABOOSARANG STREET,
VIZAG-1, AP, INDIA

# ముందుమాట

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్

అల్‌హందులిల్లాహివస్సలాతు వస్సలామ్ అలారసూలిహిల్‌కరీమ్. అమ్మాబాఅద్

**ప్రవక్తా! వారికి ఇలా చెప్పు "మీరు నిజంగా దేవుడ్ని అభిమానిస్తుంటే నన్ను (ప్రవక్త ముహమ్మద్) అనుసరించండి దేవుడు మిమ్మల్ని అభిమానిస్తాడు. మీ పాపాలు క్షమిస్తాడు. దేవుడు ఎంతో క్షమించేవాడు. కరుణించేవాడు.**

***(ఖుర్‌ఆన్ 3వ సూర అలిఇమ్రాన్ 31వ వాక్యం)***

దేవుని ఏకత్వం తరువాత దైవ ప్రవక్తలను విశ్వసించుట చాలా ముఖ్యమైనది. ఎందుకనగా దేవుని గూర్చి తెలుసుకొనుటకు దైవ ప్రవక్తల సందేశం తప్పనిసరి ఇస్లాం ధర్మం స్వీకరించే వారు లాఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్ ర్రసూలుల్లాహ్ అను వాక్యాన్ని చదువుతారు. ఈ మాటపై మనసా వాచా కర్మా ఆచరిస్తారు. ఈ మాటకు మనసా వాచా కర్మా కట్టుబడి ఉంటామని వాగ్దానం చేస్తారు. కాని ఈ మాటకు అసలు న్యాయం చేసేవారు ఎందరు. ఇది కేవలం పిల్లలకు నేర్పే మాట, మంత్రంగా మాత్రమేనా? కాదు కాదు దీనిని విశ్వసించాలి. ఆచరించాలి లేదంటే మన ఖర్మలు వృధా అయిపోతాయి, మన వాగ్దానం నిరుపయోగమవుతుంది. ఇలాంటి విషయాలు చాలామంది తెలుగు పాఠకులకు తెలియటం లేదనే తలంపుతో ఈ చిరు పుస్తకాన్ని ముద్రించడం జరిగింది.

కావున పాఠకులారా! అల్లాహ్ మరియు ప్రవక్త (స.అ.స.) దారిన నడవండి. మోక్షం పొందండి. ఇమాముల దారి, ముఫ్తీల దారి, మహా పురుషులను వదలి, ప్రవక్త దారిన నడవండి స్వర్గాన్ని పొందండి. ఈ పుస్తకమును ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించినవారందరికీ అల్లాహ్ ఇహ పరాలలో సుఖ సంతోషాలను ప్రసాదించుగాక! ఆమీన్.

ఈ చిరు పుస్తకాన్ని చదివి విషయాలను గ్రహించి ఆచరించి ఇతరులకు కూడా అందజేయవలసిందిగా కోరుచున్నాము.

**బహదూర్**

డో.నెం. 28-29-1,
ముస్లిమ్స్ కణితి RH కోలనీ,
వడ్లపూడి, విశాఖపట్నం-46.

✆ **9848067793**
**9951452322**

డో.నెం. 24-63-2C
అబూసరంగ్ వీధి (కోట వీధి),
విశాఖపట్నం-01.

## బిస్మిల్లా హిర్రహ్మానిర్రహీమ్

وَمَنْ يَّعْصِ اللّٰهَ وَرَسُوْلَهٗ فَاِنَّ لَهٗ نَارَ جَهَنَّمَ خٰلِدِيْنَ فِيْهَآ اَبَدًا ۝

**అల్లాహ్, ఆయన ప్రవక్తల మాటలను విశ్వసించకపోతే, వారు నరకాగ్నికి గురౌతారు. అటువంటి వారు అందులోనే శాశ్వతంగా పడిఉంటారు.**

***(ఖుర్ఆన్ 72వ సూర, జిన్న్ 23వ వాక్యం)***

**ప్రవక్తా! నీవు ప్రజలకు ఇలా చెప్పు "మీకు నిజంగానే అల్లాహ్‌పట్ల ప్రేమే ఉంటే నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు. ఆయన అమితంగా క్షమించేవాడు. అనన్యంగా కరుణించేవాడును. వారితో ఇంకా అల్లాహ్‌కూ ప్రవక్త (ముహమ్మద్ స.అ.స.) కు విధేయత చూపండని" అను ఒక వేళ వారు నీ ఈ సందేశాన్ని స్వీకరించకపోతే, అల్లాహ్ తనకూ, తన ప్రవక్తకూ విధేయత చూపటానికి నిరాకరించిన వారిని ప్రేమించటం అనేది నిశ్చయంగా జరగదు.**

***(ఖుర్ ఆన్ 3వ సూర అలి ఇమ్రాన్ 31-32 వ వాక్యం)***

**3:31-32 వ్యాఖ్యానం :** హాఫీజ్ ఇబ్నె కసీర్ (రహ్మ) వారు ఈ వచనముపై ఇలా వ్యాఖ్యానించారు. ఈ వచనము ఇలాంటి వారందరికి వర్తిస్తుంది. అల్లాహ్ పట్ల భయభక్తులు కల్గి ఉన్నామని ప్రకటిస్తారు కాని ముహమ్మద్ (స.అ.స.) వారి విధానాన్ని (హదీస్) ను వ్యతిరేకిస్తారు. అలాంటి వారికి ఇది హెచ్చరిక లాంటిది. ఏ వ్యక్తి అయిన అల్లాహ్ ప్రేమను పొందాలంటే ముహమ్మద్ (స.అ.స.) వారి బోధనలను ఆచరణా విధానాలను తన జీవిత విధానంగా మార్చుకోవాలి. ఆఇషా (రజి) వారు ఇలా ఉల్లేఖించారు. నేను బోధించని విషయాలపై ఆచరించిన యెడల ఆ కర్మలు మర్‌దూద్ (వృధా) అవుతాయి అని ముహమ్మద్ (స.అ.స.) తెలిపిరి.

***(బుఖారి, ముస్లిం)***

**హదీసు :** దైవప్రవక్త (స.అ.స.) తెలిపిరి. నేను మీ మధ్య రెండు వస్తువులను వదలి వెళ్ళుచున్నాను. వాటి ప్రకారం అచరిస్తే ఎన్నటికీ పెడత్రోవ పట్టరు. 1. దైవ గ్రంథం ఖుర్ ఆన్ 2. నా సున్నత్ (హదీస్) దీనిని హాకిమ్ ఉల్లేఖించారు.

**అల్లాహ్‌కూ, ప్రవక్తకూ విధేయత చూపండి మీరు కరుణింపబడే అవకాశం ఉంది. (ఖుర్ ఆన్ 3వ సూర అలిఇమ్రాన్, 132)**

**ఇవి అల్లాహ్ విధించిన హద్దులు, అల్లాహ్‌కూ ఆయన ప్రవక్తకూ విధేయత చూపెవాణ్ణి అల్లాహ్, క్రింద సెలయెళ్ళు ప్రవహించే ఉద్యానవనాలలో ప్రవేశింప జేస్తాడు. ఆ వనాలలో అతడు కలకాలం ఉంటాడు. అసలు ఇదే గొప్ప సాఫల్యం. అల్లాహ్‌కూ ఆయన ప్రవక్త ముహమ్మద్ (స.అ.స.) కూ అవిధేయత చూపుతూ అల్లాహ్ విధించిన హద్దులను అతిక్రమించే వాణ్ణి అల్లాహ్ అగ్నిలో పడవేస్తాడు. అందులో అతడు సదా ఉంటాడు. అతనికి మిక్కిలి అవమానకరమైన శిక్ష పడుతుంది. (ఖుర్ ఆన్ 4వ సూర, అన్‌నిసా 13-14వ వాక్యములు)**

**4:13-14 వ్యాఖ్యానం :** అల్లాహ్ విధించిన హద్దులను అతిక్రమించకుండా ఉండటం అంటే ఒక వ్యక్తి తనకున్న ఆస్థిని తన తదనంతరం తన వారసులకు ఎలా పంచాలి, ఎవరికి ఎంత ఎంత భాగాన్ని కేటాయించాలి అనే విషయాన్ని అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో తెలియజేశాడు. అలానే ఈ వచనము కంటే ముందు వచనములలో అనాథల ఆస్థిని కాజేయరాదని ఖుర్‌ఆన్‌లో మరోచోట ఇలా కూడా చెప్పబడింది. చట్టంలో లొసుగులను ఉపయోగించుకొని ఇతరుల ఆస్థులను కాజేయటం కూడా అవుతుంది. అలా కాకుండా అల్లాహ్ విధించిన హద్దులను అతిక్రమించకుండా అల్లాహ్‌కు ప్రవక్తకు విధేయత చూపినట్లైతే స్వర్గ వనాలలో శాశ్వతంగా ఉంటాడు. లేదంటే నకరంలో అవమాన భరితమైన శిక్షకు గురువుతారని అల్లాహ్ హెచ్చరిస్తున్నాడు.

**విశ్వసించిన ప్రజలారా! విధేయత చూపండి అల్లాహ్‌కు విధేయత చూపండి ప్రవక్త (ముహమ్మద్ స.అ.స.) కు మీలో అధికారం అప్పగించబడిన పెద్దలకు, మీ మధ్య ఏ విషయం లోనైనా వివాదం తలఎత్తితే దాన్ని అల్లాహ్‌కు, ప్రవక్తకు నివేదించండి. మీరు నిజంగానే అల్లాహ్‌మీద అంతిమ దినం మీదా విశ్వాసం కలవారే అయితే ఇదే సరియైన పద్ధతి. ఫలితాన్ని బట్టి కూడా ఇదే ఉత్తమమైనది. (ఖుర్‌ఆన్, 4వ సూర, అన్‌నిసా 59వ వాక్యం)**

**4:59 వ్యాఖ్యానం :** ఈ వచనానికి ముందు వచచనము అధికారము అప్పగింపబడినవారు సరైన రీతిలో న్యాయం చెయ్యాలని చెప్పబడింది.

తీర్పు చెప్పేటప్పుడు ఎలా వ్యవహరించాలో అన్నది ఈ వచనములలో కనబడుతుంది. మొదటిది తీర్పు చెప్పేవారు అల్లాహ్‌కు ప్రవక్తకు విధేయులై ఉండాలి. అంటే తీర్పు చెప్పే వ్యక్తి ఖుర్ఆన్ మరియు హదీసులకు అనుగుణంగా తీర్పు చెప్పాలి. బుఖారి గ్రంథంలో ఓ హదీసులో ఇలా చెప్పబడింది. ముహమ్మద్ (స.అ.స.) వారు ఇలా తెలియజేశారు. ఎవరైతే నన్ను అనుకరించారో వారు అల్లాహ్ మాటను అనుకరించినట్లే. ఎవరైతే నన్ను (నా మాటను) వ్యతిరేకించారో వారు అల్లాహ్‌ను వ్యతిరేకించినట్లే. ఎవరైనా నా అమీర్ (మీరు ఎన్నుకున్న పెద్ద) ను అనుకరించారో నన్ను అనుకరించినట్లే ఆయన్ను వ్యతిరేకిస్తే నన్ను వ్యతిరేకించినట్లే.

ఈ హదీసులో అమీర్ (మీరు ఎన్నుకున్న పెద్ద) ను ఎప్పుడు అనుకరించాలి అంటే ఆయన ఖుర్ఆన్‌ను హదీసులకు అనుగుణంగా వ్యవహరించినప్పుడే అందుకే ఈ వచనములలో మీ మధ్య అభిప్రాయబేధం కల్గినప్పుడు అల్లాహ్‌కు ప్రవక్తకు నివేదించమని చెప్పబడింది. అంటే ఈ విభేధాలకు పరిష్కారం ఖుర్ఆన్ హదీసుల ద్వారా పరిష్కరించమని అలా చెయ్యని యెడల ఆల్లాహ్‌పై అంతిమ దినంపై విశ్వాసం లేనట్లే అని ఈ వచనము ద్వారా తెలుస్తుంది.

అమీర్ మాట వినాలని ఖుర్ఆన్ చెప్పబడిందని ఆయన చెప్పిందల్లా గుడ్డిగా అనుకరించే వారు ఉన్నారు. గుడ్డిగా అనుకరించకూడదనే విషయమై హజరత్ అలీ (రజి) ఉల్లేఖించిన హదీసులో చెప్పబడింది.

ఒకసారి ముహమ్మద్ (సల్లం) వారు ఓ అన్‌సారి వ్యక్తిని సైన్యానికి అధిపతి చేసి పంపారు. అధిపతికి సైనికుల మధ్య ఎదో విబేధం వచ్చింది. దాంతో ఆ ఆధిపతి సైనికులపై ఆగ్రహించి పెద్ద మంట వేయించి అందు అందరిని దూకమని ఆజ్ఞాపించాడు. ఆ సైనికులలో ఓ యువకుడు ముందు వచ్చి సైనికులతో ఇలా అన్నాడు. తొందరపడకండి మనం ప్రవక్త వారిని సంప్రదించి ప్రవక్త వారి ఆజ్ఞ అయితే అలా చేద్దాం. ఎందుకంటే మనం ప్రవక్త (సల్లం) వారిపై విశ్వాసం తెచ్చాం కాబట్టి, తరువాత వారు ప్రవక్త వద్దకు వచ్చి వారు జరిగిన వృత్తాంతం చెప్పారు. అది విని ముహమ్మద్ (సల్లం) వారు ఇలా అన్నారు. మీరు అలా చేసి ఉంటే ఎన్నటికి తిరిగి వచ్చేవారు కాదు. అమీర్ చెప్పిన మంచి విషయాలనే అనుకరించండి.

(మంచి అంటే ఖుర్ఆన్ హదీస్ ప్రకారం చెప్పినప్పుడే) (బుఖారి ముస్లిం) 1. ఇస్లామి వ్యవస్థలో విధేయత చూపటానికి అర్హుడు అల్లాహ్ మాత్రమే. ఒక ముస్లిమ్ అన్నింటికంటే ముందు దైవానికి దాసుడు. మిగిలినవన్నీ ఏవైనా ఉంటే దీని తరువాతనే 2. ఇస్లామీ వ్యవస్థకు రెండో పునాది. ప్రవక్తపట్ల విధేయత చూపటం 3. పై రెండు విధేయతల తరువాత వాటికి లోబడి ఉండే, మూడో విధేయత ఏమిటంటే అధికారం అప్పగించబడిన పెద్దల పట్ల చూపే విధేయత, స్వయంగా ముస్లిములలోని వారై ఉండాలి. "ఉలిల్ అమ్ర్" యొక్క భావంలో ముస్లిముల సామూహిక వ్యవహారాలను చూసే నాయకులు అందరూ చేరి ఉన్నారు. వారు విద్వాంసులైనా లేక రాజకీయ మార్గ దర్శకత్వం వహించే నాయకులైనా, లేక దేశ పాలనా వ్యవహారాలను నిర్వహించే అధికారులైనా లేక సాంస్కృతిక, సామాజికి విషయాలలో తెగలకు, పల్లెకు, వాడలకు పెద్దలుగా ఉండే నాయకులు,సర్ధారులు అయినా సరే. 4. దైవాజ్ఞ, దైవ ప్రవక్త పద్ధతి – ఈ రెండు మౌళిక శాశనంగా అంతిమ ప్రమాణంగా ఉంటాయి. ముస్లిముల మధ్య లేదా ప్రభుత్వానికి ప్రజలకు మధ్య ఏ సమస్యలోనైనా వివాదం తలెత్తితే దాని విషయంలో తీర్పునకు ఖుర్ఆన్, సున్నత్‌లను సంప్రదించటం జరుగుతుంది. అక్కడ లభించే తీర్పును అందరూ శిరసావహించవలసి ఉంటుంది.

**ముహమ్మద్! నీ ప్రభువు సాక్షిగా! వారు తమ పరస్పర విభేదాల విషయంలో నిన్ను న్యాయనిర్ణేతగా స్వీకరించనంతవరకు ఇంకా నీవు ఏ నిర్ణయం చేసినా దానిని గురించి వారి మనస్సులలో కూడా ఏమాత్రం సంకోచం లేకుండా. దానిని యథాతథంగా శిరసావహించనంతవరకు వారు నిజమైన విశ్వాసులు కాలేరు.** ***(ఖుర్ ఆన్, 4వ సూర అన్‌నిసా, 64-65 వ వాక్యం)***

**4 : 64 వ్యాఖ్యానం:** ఈ వచనములో అల్లాహ్ తన సాక్షిగా చెప్పినదేమంటే నిజమైన విశ్వాసులు అవ్వాలంటే ప్రతి వ్యక్తి ముహమ్మద్ (సల్లం) వారి మాటలను ఆయన చెప్పిన తీర్పును మనస్సులో ఎలాంటి సంకోచం లేకుండా ఇబ్బంది పడకుండా సంతోషంగా ఆచరించాలి. శిరసావహించాలి. అలా నడుచుకున్న వాడే నిజమైన ముస్లిం విశ్వాసి అవుతాడని ఈ వచనము ద్వారా తెలుపబడింది.

ఈ వచనము అవతరించుటకు గల కారణం వాటి వివరాలు బుఖారిలో ఈ విధంగా చెప్పబడింది.

అరవహ్ బిన్ జుబైర్ (రజి) ఈవిధంగా ఉల్లేఖిస్తున్నారు. నాకూ ఓ అన్సారికి మధ్య పొలానికి నీరు పెట్టే విషయంలో విభేదాలు వచ్చాయి. ఈ విషయమై మేము ముహమ్మద్ (సల్లం) వారి వద్దకు వెళ్ళి మా విభేదాన్ని పరిష్కరించమని విన్నవించాము. అంతట ప్రవక్త వారు ఓ జుబైర్ నీ పొలం పూర్తిగా తడిచిన తరువాత నీ ప్రక్కవాని పొలంలోకి నీళ్ళు వదులు అన్నారు. అది విన్న అన్సారి ఓ ప్రవక్త అతడు మీ దగ్గర బంధువు కావటంచే మీరు ఇటువంటి తీర్పు చెప్పారు అన్నాడు. ఆ మాట విన్న ప్రవక్త వారి ముఖం కోపంతో ఎర్రబారింది. ప్రవక్త వారు జుబైర్ (రజి) ఇలా అన్నారు. ఓ జుబైరు ముందు నీ పొలం పూర్తిగా తడుపుకో ఎంత వరకు అంటే దాని గట్టు అంచుచేరే వరకు తరువాత నీ ప్రక్క పొలంలోకి నీళ్ళు వదులు అన్నారు. ఇదే సరైన న్యాయం అన్నారు. అప్పుడే ఈ వచనము అవతరించి ఉంటుందని జుబైర్ (రజి) వారు తెలిపిరి. ఈ వచనములో ప్రతీ ముస్లిం ముహమ్మద్ (సల్లం) వారు తీర్పును మనసా వాచా కర్మానా అంగీకరించాలని లేని యెడల అతడు పరిపూర్ణ ముస్లిం కాలేడని చెప్పబడింది. (బుఖారి)

ముహమ్మద్ (సల్లం) వారు చెప్పిన తీర్పు ఎలా అంగీకరించారో విశ్వాసులు మూడు అంశాలుగా విభజించి ఈ విధంగా చెప్పారు. 1) ముహమ్మద్ (సల్లం) వారు చెప్పిన తీర్పును అంగీకరించడం 2) మనస్సులో ఇలాంటి నమ్మకం కల్గి ఉండాలి ప్రవక్త (సల్లం) చెప్పిన తీర్పు సత్యమైనదని నమ్మాలి. 3) ముహమ్మద్ (సల్లం) వారు చెప్పిన తీర్పుని అంగీకరించడంలో ఎలాంటి సంకోచము లేకుండా ఉండాలి.

**అల్లాహ్‌కు, ప్రవక్త ముహమ్మద్ (స.అ.స.)కు విధేయత చూపేవారు. అల్లాహ్ అనుగ్రహానికి పాత్రులైనవారితో ఉంటారు. అంటే ప్రవక్తలు, సత్యసంధులు, షహీదులు, సజ్జనులూనూ ఎవరికి దొరికినా ఈ స్నేహితులు ఎంత మంచివారు.** ***(ఖుర్ ఆన్, 4వ సూర అన్‌నిసా, 69 వ వాక్యం)***

**4 :69 వ్యాఖ్యానం :** అల్లాహ్ అనుగ్రహాన్ని ఆయన అనుగ్రహాన్ని పొందేవారితో పాటు స్వర్గంలో ఉండాలంటే అల్లాహ్ మరియు ప్రవక్త (సల్లం) వారి పట్ల విధేయత కల్గి ఉండాలి. విధేయత కల్గి ఉండడం

అంటే ఖుర్ఆన్ హదీసు గ్రంథాల ప్రవచనాలకు అనుగుణంగా జీవితాన్ని గడపాలి. పైన చెప్పబడిన వచనములలో పరిపూర్ణ ముస్లిం కావాలంటే ఎలా ఉండాలో చెప్పబడింది. పరిపూర్ణ ముస్లింలకు స్వర్గంలో ఎలాంటి స్థానం లభిస్తుందో ఈ వచనములో చెప్పబడింది.

ఇక ఈ వచనము అవతరణ విషయాలు తెలుసుకుందాం. హదీసు గ్రంథం ఇలా చెప్పబడింది. ఒకరోజు ఓ అన్సారి (రజి) ప్రవక్త (సల్లం) వారి చెంత దిగులుగా కూర్చుని ఉన్నారు అది గమనించి ప్రవక్త (సల్లం) వారు ఏమిటి? అలా దిగులుగా కూర్చున్నావు అని ప్రశ్నించారు. అంతట ఆయన ఇలా అన్నారు. ఓ ప్రవక్త నేను ఈ విషయమై ఆలోచించుచున్నాను. నేను ఇహలోక జీవితంలో మేము ఉదయం సాయంత్రం మీ వద్దకు కూర్చుంటున్నాము. రేపు స్వర్గంలో మీరు గొప్ప స్థానంలో ప్రవక్తలతో ఉంటారు. అక్కడ మిమ్మల్ని చూసే భాగ్యం లభించదు కదా అని చింతిస్తున్నాను అన్నారు. అది ముహమ్మద్ (సల్లం) ఏమీ మాట్లాడకుండా ఉండిపోయారు. అంతలో జిబ్రాయిల్ ధూత ఈ వచనాన్ని తీసుకొని వచ్చారు. ఈ వచనము అవతరించిన వెంటనే ప్రవక్త వారు ఆ సహాబీని పిలిపించి పై శుభవార్త వినిపించారు. (బుఖారి)

**ముహమ్మద్ మేము నిన్ను మానవజాతికి సందేశహరుడుగా చేసి పంపాము. దీనికి అల్లాహ్ సాక్ష్యం చాలు ప్రవక్తకు విధేయత చూపినవాడు వాస్తవంగా అల్లాహ్‌కు విధేయత చూపినట్లే. కాని ఎవడైతే విముఖుడౌతాడో అటువంటి వారిపై మేము నిన్ను కావలివానిగా చేసి పంపలేదు.**

***(ఖుర్ ఆన్, 4వ సూర, అన్నిసా 79-80వ వాక్యం)***

**4:79-80 వ్యాఖ్యానం :** ఇచ్చట ఒక మాట విశదీకరింపబడింది. అది ఏమనగా, పూర్వ ప్రవక్తల యొక్క ఆగమనం ఒక ప్రాంతానికి, ఒక దేశానికి, ఒక జాతికి ఒక వంశానికి ఒక తెగకు, మాత్రమే వచ్చేవారు. కాని ఈ ప్రవక్త ముహమ్మద్ (స.అ.స.) సర్వమానవులకు ప్రవక్త. ఈ అంతిమ ప్రవక్తకు ఏమానవుడైనా విధేయత చూపినచో సర్వసృష్టికర్తకు విధేయత చూపినట్లే ఎందుకనగా ప్రవక్త ముహమ్మద్ (స.అ.స) తనంతట తాను ఏదియు బోధింపక దైవవాణి ద్వారా తాను విన్నది భోదించును.

ప్రవక్తమాట దేవుని మాట ప్రవక్త ఆదేశాలను ఆచరించినచో దేవుని ఆదేశాలను ఆచరించినట్లు ప్రవక్త మాటను జవదాటనిచో దేవుని మాటకు జవదాటలేనట్లే. దేవుని యొక్క మెళ్ళు, శిక్షలు మహాప్రవక్త (స.అ.స) ద్వారా ప్రజలకు తెలుపుట జరిగింది. కాబట్టి ప్రవక్త దారి వదలి ఏ మహా పురుషుల దారి నడిచినా **ఉదా**: వలీ, బాబా, ఇమామ్, బుజ్‌రుగ్, ఆలిమ్, ముఫ్తి, మొదలగువారి దారి నడిచిన యెడల సృష్టికర్తయగు అల్లాహ్ అలాంటి కర్మలను స్వీకరించడు.

**వాస్తవానికి మీ మిత్రులు కేవలం అల్లాహ్, అల్లాహ్ యొక్క ప్రవక్త నమాజును స్థాపించే, జకాత్ ఇచ్చే, అల్లాహ్ ముందు రుకూ చేసే విశ్వాసులు మాత్రమే. అల్లాహ్‌నూ ఆయన ప్రవక్తనూ విశ్వాసులనూ తమ మిత్రులుగా స్వీకరించే వారు అల్లాహ్ పక్షమే ఆధిక్యం వహిస్తుందని తెలుసుకోవాలి.**

*(ఖుర్ఆన్ 5వ సూర అల్ మాయిదా 55- 56వ వాక్యం)*

**అల్లాహ్ మాటను ఆయన ప్రవక్త మాటను వినండి. వాటిని (సారాయి, జూదం, దైవేతర మందిరాలు పాచికల ద్వారా జోస్యం) మానుకోండి. కానీ మీరు గనక ఆజ్ఞలను పాలించకపోతే, బాగా తెలుసుకోండి. మా ప్రవక్తపై ఉన్న బాధ్యత కేవలం ఆజ్ఞలను స్పష్టంగా అందజేయటమే.**

*(ఖుర్ఆన్ 5వ సూర మాయిద 92వ వాక్యం)*

**నా ఋజుమార్గం ఇదే. కనుక మీరు దీనిపైనే నడవండి. వేరే మార్గాలపై నడవకండి.** *(ఖుర్ఆన్ 6వ సూర అన్ఆమ్ 153వ వాక్యం)*

**ఈ సందేశహరుణ్ణి, చదువనూ వ్రాయనూ రాని ఈ ప్రవక్త (స.అ.స.) ను అనుసరించేవారు. (ఈనాడు ఈ కారుణ్యానికి అర్హులు) అతని ప్రస్తావన వారికి తమవద్ద ఉన్న తౌరాతు, ఇంజీలు గ్రంధాలలో వ్రాయబడి ఉంది. అతను వారికి మంచిని ఆజ్ఞాపిస్తాడు. చెడునుండి నిరోధిస్తాడు. వారి కొరకు పరిశుద్ధమైన వస్తువులను ధర్మ సమ్మతం చేస్తాడు. అపరిశుద్ధమైన వాటిని నిషిద్ధం చేస్తాడు. వారిపై మోపబడిఉన్న బరువులను దించుతాడు. వారు బంధించబడి ఉన్న శృంఖాలను త్రెంచుతాడు. కనుక అతనిని విశ్వసించి సమర్థించి అతనికి సహకరించీ అతనితో అవతరింపజెయ్యబడిన జ్యోతిని (ఖుర్ఆన్)ను అనుసరించేవారు మాత్రమే సాఫల్యం పొందేవారు ముహమ్మద్! ఇలా**

**ప్రకటించు. మానవులారా! నేను మీ అందరివైపునకు వచ్చిన అల్లాహ్ సందేశహరుణ్ణి ఆయన భూమ్యాకాశాల సామ్రాజ్యానికి ప్రభువు. ఆయన తప్ప మరొక దేవుడు లేడు. ఆయనే జీవితాన్ని ప్రసాదిస్తాడు. ఆయనే మృత్యువును ఇస్తాడు. కనుక విశ్వసించండి అల్లాహ్‌ను, ఆయన పంపిన నిరక్షరాస్యుడైన ప్రవక్తను అతను అల్లాహ్‌ను ఆయన సూక్తులను విశ్వసిస్తాడు. అతనిని అనుసరించండి. మీరు సరైన మార్గం పొందుతారేమో.**

***(ఖుర్ఆన్ 7వ సూర అల్ ఆరాఫ్ 157-158)***

**7:157-158 వ్యాఖ్యానం :** ముహమ్మద్ (స.అ.స.) వారి రాక గురించి యూదుల వద్ద నున్న తౌరాతు గ్రంథంలోను, క్రైస్తవుల యొద్ద నున్న ఇంజీలు (బైబిల్)లో చెప్పబడి ఉందని ఈ వచనములో వివరించబడింది. అంతేకాకుండా ఈయన నిరక్ష్యరాసుడై ఉండి కూడా అద్భుతమైన విషయాలు తెలియజేస్తాడని అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతున్న మానవాళికి జ్ఞాన జ్యోతులు వెలిగించి సన్మార్గం చూపుతారని కాబట్టి ఆయన చూపిన మార్గాన్ని అనుసరించిన వారు మాత్రమే సాఫల్యం పొందుతారు ముహమ్మద్ (సల్లం) గురించి తౌరాతు బైబిల్‌లలోనే కాకుండా వేదాలలో కూడా చెప్పబడినట్లు రుజైవైనది.

వేదాలు, భవిష్య పురాణంలో మహమదా, లింగస్ఛేది మొదలగునవి బైబిల్‌లో, ఆ ప్రవక్త, సత్య స్వరూపి, అహ్మద్, ఆదరణకర్త మొదలగునవి.

**అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్తకూ విధేయత చూపండి, మీరు గనక విశ్వాసులైతే".** ***(ఖుర్ఆన్ 8వ సూర అన్‌ఫాల్ 1వ వాక్యం)***

**విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్తకూ విధేయత చూపండి. ఆజ్ఞ విన్న తరువాత దాని నుండి మరలకండి. వాస్తవంగా వినకుండానే "మేము విన్నాము" అని అనే వారివలే మీరూ అయిపోకండి. తమ బుద్ధిని ఉపయోగించని చెవిటివారూ, మూగవారూ మాత్రమే నిశ్చయంగా అల్లాహ్ దృష్టిలో నీచాతి నీచమైన కోవకు చెందిన జంతువులు. వారిలో ఏ కొద్దిపాటి మంచితనమైనా ఉందని అల్లాహ్‌కు అనిపించి ఉంటే, ఆయన వారికి తప్పకుండా వినే భాగ్యం కలుగజేసి ఉండేవాడు. (కాని ఆ మంచితనం లేకుండా) ఆయన గనక వారికి వినిపించి ఉండినట్లయితే, వారు నిర్లక్ష్యంగా తమ ముఖాలను త్రిప్పుకుని ఉండే వారే.**

**విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్, పిలుపునకూ, ఆయన ప్రవక్త పిలుపునకూ జవాబు పలకండి. ప్రవక్త మీకు జీవితాన్ని ప్రసాదించే దానివైపునకు మిమ్మల్ని పిలిచినప్పుడు** (ఖుర్ఆన్ 8వ సూరఅన్‌ఫాల్ 20-24వ వాక్యం)

**8:20-24 వ్యాఖ్యానం :** ఈ వచనము కపట విశ్వాసుల తత్వాన్ని అవిశ్వాసుల వైఖరిని వివరించడం జరిగింది. అంటే నిజాన్ని గ్రహించే అర్థం చేసుకునే శక్తి సామర్థ్యాలు ఉండి కూడా గర్వంతో నిరాకరించడం వారి తత్వం అని తెలియజేయబడింది. ఇలాంటి వారు హీనాతి హీనమైన జంతువులు అని అల్లాహ్ అంటున్నాడు. ఎందుకంటే జంతువులకు కూడా కళ్ళు చెవులు, నోరు, మెదడు ఉంటాయి కాని కళ్ళతో చూసినా, చెవులతో విన్నా అవి సత్యాన్ని గ్రహించలేవు, అర్థం చేసుకోలేవు అంటే సత్యాన్ని గ్రహించలేనివారు కూడా అటువంటి వాడే!

ఇహ పరలోకాలలో శాంతియుతమైన జీవితం పొందాలంటే ముహమ్మద్ (సల్లం) వారి బోధనలకు అనుగుణంగా జీవితం గడపాలని లేకుంటే తీవ్రమైన నష్టానికి గురి అవుతారని తెలుస్తుంది.

**అల్లాహ్‌కూ ఆయన ప్రవక్తకూ విధేయత చూపండి. పరస్పరం కలహించుకోకండి, అలా జరిగితే మీలో బలహీనత ప్రవేశిస్తుంది.**

**మీ శక్తి సన్నగిల్లిపోతుంది. సహనంతో మెలగండి నిశ్చయంగా అల్లాహ్ సహనం చూపేవారితో ఉంటాడు.**

(ఖుర్ఆన్ 8వ సూర అన్‌ఫాల్ 46వ వాక్యం)

**8:46 వ్యాఖ్యానం :** అల్లాహ్ పట్ల ప్రవక్త పట్ల విధేయత చూపుతూ పరస్పరం కలిసి మెలసి ఉండమని చెప్పడం జరిగింది. అలా కాని పక్షంలో మీలో బలహీనత ప్రవేశించి మీ శక్తి సామర్థ్యాలు సన్నగిల్లి పోతాయని కూడా హెచ్చరించడం జరిగింది. అంతేకాకుండా కలిసి మెలసి ఉండడానికి సహనం ఎంతో అవసరం. మీరు గనుక సహనంతో అల్లాహ్ మరియు ప్రవక్త ప్రవచనాలకు అనుగుణంగా జీవనం సాగిస్తే ఇహ పరలోకాలలో సాఫల్యం పొందుతారు అని ఈ వచనము ద్వారా విశదమగుచున్నది.

**ప్రవక్తా! ఇలా అను : "ఒకవేళ మీ తండ్రులు, మీ కుమారులు, మీ సోదరులు, మీ భార్యలు, మీ బంధువులు, మీ ఆప్తులు, మీరు సంపాదించిన ఆస్థిపాస్తులు, మందగిస్తాయేమో అని మీరు భయపడే మీ వ్యాపారాలు, మీరు ఇష్టపడే**

**మీ గృహాలు అల్లాహ్ కంటే ఆయన ప్రవక్త కంటే ఆయన మార్గంలో శ్రమించటం కంటే మీకు గనక ఎక్కువ ప్రియతరమైతే, అల్లాహ్ తన తీర్పును మీ ముందుకు తీసుకువచ్చే వరకు నిరీక్షించండి. అల్లాహ్ దోషులకు మార్గం చూపడు".**

*(ఖుర్ఆన్ 9వ సూర అత్ తౌబా 24వ వాక్యం)*

**9:24 వ్యాఖ్యానం :** ఈ వాక్యమునకు ముందు విశ్వాసికి అవిశ్వాసి మధ్య బేధాన్ని తెలపమని ఆజ్ఞ. మీరు ధర్మ విషయాలలో ఎటువంటి దోషానికి పాల్పడకూడదు. మీ యొక్క కుటుంబం ద్వారా గాని, మీ వ్యాపారరీత్యాగాని ధర్మ వ్యతిరేక కార్యములు ఎట్టి పరిస్థితులలో పాల్పడరాదు. అవిశ్వాసానికి ప్రాధాన్యం ఇచ్చే మీ విషయంలో దైవ ధర్మమే ప్రధానం. అవిశ్వాసానికి ప్రాధాన్యం ఇచ్చే మీ తండ్రులు మీ తల్లి మరియు సోదరులు, ఆస్థిపాస్తులు అన్ని నాశనమైపోవలసినవే. ప్రళయం రోజును ఇవి ఏమీ పనికిరావు. మీ విశ్వాసం మీ దైవ ధర్మ సదాచరణ పుణ్యాలు మాత్రమే, స్వర్గంలో వెళ్ళు టకు తోడ్పడుతాయి. అల్లాహ్ మరియు ప్రవక్త ప్రసన్నత మీకు ముఖ్యం.

**విశ్వాసులైన పురుషులూ, విశ్వాసులైన స్త్రీలూ వారందరూ ఒకరికొకరు సహచరులు, వారు మేలు చేయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. చెడు చెయ్యవద్దు అని నిరోధిస్తారు. నమాజును స్థాపిస్తారు. జకాత్‌ను ఇస్తారు. అల్లాహ్‌పట్ల ఆయన ప్రవక్తపట్ల విధేయత పాటిస్తారు. వారి మీద అల్లాహ్ తన కారుణ్యాన్ని తప్పకుండా అవతరింపజేస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ అందరికంటే ప్రబలుడు వివేకవంతుడూ, వివేచనాపరుడూను.** *(ఖుర్ఆన్ 9వ సూర అత్ తౌబా 71వ వాక్యం)*

**9:71 వ్యాఖ్యానం :** విశ్వాసులు అయిన స్త్రీ, పురుషులు, ఒకరికొకరు సహచరులు అంటే వీరిరువులు ఇస్లాం ధర్మాన్ని ప్రచారం చెయ్యడంలో దాన్ని ఆచరించడంలో ఒకరికొకరు సహకరించుకుంటారు. మంచిని బోధించడంలో చెడును నివారించడంలో కృషి చేస్తారు, అంతేకాకుండా అల్లాహ్ పట్ల ప్రవక్త పట్ల విధేయత పాటిస్తారు. ఇస్లాం ధర్మాన్ని పరిరక్షణలో కృషి చేసేవారు అల్లాహ్ మరియు ప్రవక్తకు విధేయత చూపడం అంటే ప్రవక్త వారి ప్రవచనములకు అనుగుణంగా ఇస్లాం ధర్మాన్ని పాటించాలి. అలా కాకుండా పరిస్థితుల కనుగుణంగా కాలానికి అనుగుణం ధర్మాన్ని మార్చరు, మార్చబడదు అన్న విషయం గుర్తించుకోవాలి.

**చూడండి! మీ వద్దకు ఒక ప్రవక్త వచ్చాడు. ఆయన స్వయంగా మీలోనివాడే. మీరు నష్టానికి గురికావటం అనేది ఆయనకు కష్టం కలిగిస్తుంది. మీ సాఫల్యాన్ని ఆయన తీవ్రంగా కాంక్షిస్తాడు. విశ్వాసులపై ఆయన వాత్సల్యం కలవాడు, కారుణ్యం కలవాడు - ఇక వారు నీకు విముఖులైతే, ప్రవక్తా! వారితో ఇలా అను "నాకు అల్లాహ్‌యే చాలు. ఆయన తప్ప ఆరాధ్యుడు ఎవ్వడూ లేడు. ఆయననే నేను నమ్ముకున్నాను. ఆయన మహత్తరమైన అధికార పీఠానికి ప్రభువు."**

*(ఖుర్‌ఆన్ 9వ సూర అత్ తౌబా 128-129వ వాక్యం)*

**9:128-129 వ్యాఖ్యానం :** ముహమ్మద్ ప్రవక్త (స.అ.స.) మీలోని వాడే. అంటే మీ ప్రాంతం వాడే అని భావమే కాకుండా మానవుడే అనే భావం కూడా జనిస్తుంది. ఆయన మేలు కాంక్షిస్తాడు. మీకు నష్టం కలిగితే ఆయనకు కష్టం కలుగుతుంది. అంటే ముహమ్మద్ (సల్లం)ను మానవాళి మేలుకోరే శుభకారుణ్యుడిగా ప్రవక్తగా చేసి పంపాడు. అల్లాహ్ ఆయన బోధనలకు అనుగుణంగా జీవితం గడిపితే ఇహ పరలోకాలలో మేలు పొందుతారు. ఆయనకు విముఖులైతే నష్టపోయేది మీరే సుమా అన్న విషయం ఈ వచనములో తేటతెల్లమగుచున్నది.

**దైవప్రవక్త వారి మధ్య ఉన్న వ్యాజ్యం విషయంలో తీర్పు చెప్పడానికి వారిని అల్లాహ్ వైపునకూ, ప్రవక్త వైపునకూ రమ్మని పిలిచినప్పుడు, వారిలోని ఒక ప్రత్యర్థి వర్గం విముఖత చూపుతుంది. కాని ఒకవేళ సత్యం వారికి అనుకూలంగా ఉంటే, దైవప్రవక్త వద్దకు పెద్ద విధేయులు మాదిరిగా వచ్చేస్తారు. వారి హృదయాలకు (కపట) రోగమేదైనా తగిలిందా? లేదా వారు సంశయంలో పడిపోయారా? లేదా అల్లాహ్, మరియు ఆయన ప్రవక్త తమకు అన్యాయం చేస్తారని వారికి భయమా? అసలు విషయమేమిటంటే, అన్యాయపరులు స్వయంగా వారే, విశ్వసించే వారి పని ఏమిటంటే, తమ వ్యాజ్యాన్ని దైవ ప్రవక్త పరిష్కరించే విషయంలో వారు అల్లాహ్‌వైపునకూ, ప్రవక్తవైపునకూ పిలువబడితే "మేము విన్నాము. విధేయత చూపాము" అని అనాలి. అటువంటి వారే సాఫల్యం పొందుతారు. అల్లాహ్‌కు ప్రవక్తకూ విధేయత చూపేవారు. అల్లాహ్‌కు భయపడేవారు ఆయనపట్ల అవిధేయతకు దూరంగా ఉండేవారు మాత్రమే విజయం పొందుతారు.** *(ఖుర్‌ఆన్ 24వ సూర అన్‌నూర్ 48-52వ వాక్యం)*

**24:48-52 వ్యాఖ్యానం:** ఈ వచనములో ముస్లింలుగా నటించే వంచకుల గుణమును నిజమైన ముస్లింల తత్వమును వివరించడం జరిగింది. వంచకులు తమ మధ్య ఏదైన తగాదాలు ఏర్పడితే ముహమ్మద్ (స.అ.స.) వారి వద్దకు వెళ్ళి ఆ సమస్యకు పరిష్కారం లేదా తీర్పు చెప్పమని అడగడానికి వెనుకంజ వేస్తారు. తమకు అనుకూలంగా తీర్పురాదని భయపడతారు. అదే తమ వైపు న్యాయం ఉంటే ప్రవక్త వద్దకు పరుగున వస్తారు. వారి అవకాశవాదాన్ని వారి కపటత్వాన్ని అల్లాహ్ ఇక్కడ తెలియజేశాడు. అదే నిజమైన ముస్లిం అయితే ముహమ్మద్ (స.అ.స.) వారి మాట విన్న వెంటనే దానిని ఆచరణలో పెడతారు. వారు ఏమాత్రం ఆలోచించరు, తటపటాయించరు. కాని నేడు మన ముస్లిం సోదరులు ఎలా తయారయ్యారంటే ప్రవక్త మాట వినిపిస్తే ఇలా మా ఫిఖాలో లేదు. మా ఇమామ్ ఇలా చెప్పలేదు అంటున్నారు. ఇది ఎంతవరకు సమంజసమో ఒక్కసారి ఆలోచించండి.

**"అల్లాహ్‌కు విధేయులు కండి, దైవ ప్రవక్త ఆదేశాలను పాటించండి. కాని ఒకవేళ మీరు విముఖులైతే, బాగా తెలుసుకోండి. దైవప్రవక్తపై పెట్టబడిన కర్తవ్యభారం వరకే అతను బాధ్యుడు. మీపై మోపబడిన కర్తవ్య భారానికి మీరు బాధ్యులు, దైవ ప్రవక్తకు విధేయులైతే మీరే మార్గదర్శకత్వం పొందుతారు. లేకపోతే స్పష్టంగా ఆజ్ఞను అందజెయ్యటాన్ని మించి ఎక్కువ బాధ్యత దైవ ప్రవక్తపై లేదు."**
**(ఖుర్ ఆన్, 24వ సూర, అన్‌నూర్ 54వ వాక్యం)**

**నమాజును స్థాపించండి, జకాత్ ఇవ్వండి దైవ ప్రవక్తకు విధేయులుగా ఉండండి. అప్పుడు మీరు కరుణింపబడతారని ఆశించవచ్చు.**
**(ఖుర్ ఆన్, 24వ సూర, అన్‌నూర్ 56వ వాక్యం)**

**అది అవిశ్వాసులకు ఎంతో కఠినమైన రోజు, దుర్మార్గపు మానవుడు తన చేతులను కొరుక్కుంటూ ఇలా అంటాడు, "అయ్యో నేను దైవ ప్రవక్తకు తోడుగా ఉంటే ఎంత బాగుండేది!" (ఖుర్ ఆన్, 25వ సూర, అల్‌ఫుర్‌ఖాన్ 27వ వాక్యం)**

**వాస్తవంగానే అల్లాహ్ ప్రవక్తలో మీకు ఒక మంచి ఆదర్శం ఉండినది. అల్లాహ్‌పై, అంతిమ దినంపై ఆశలు పెట్టుకుని అత్యధికంగా అల్లాహ్‌ను స్మరించే ప్రతీ వ్యక్తికి, (ఖుర్ ఆన్, 33వ సూర, అల్ అహ్‌జాబ్ 21వ వాక్యం)**

**33:21 వ్యాఖ్యానం :** ఈ వచనములో ఓ ముస్లిం ఎలా జీవించాలో అన్న విషయం తెలియజేసింది. అల్లాహ్ ఇలా అంటున్నాడు. నా ప్రవక్త జీవితమే మీకు నమూనా వంటిది. మీరు నా ప్రవక్త జీవితమును ఆధారంగా చేసుకొని నడవండి అంటే ప్రతీ ముస్లిం ముహమ్మద్ (స.అ.స.) వారి జీవిత చరిత్ర తెలుసుకోవాలి ఆయన ఎలా నమాజు చదివేవారు ఆయన సుఖ దుఃఖాలలో ఎలా ఉండేవారు. శత్రువులతో మిత్రులతో ఎలా ఉండేవారు. భార్య బిడ్డలతో ఎలా ఉండేవారు. యుద్ధరంగంలో ఎలాంటి ధైర్య సహసాలు ప్రదర్శించేవారు. కష్టాలు వచ్చినప్పుడు ఎలా సహనం వహించేవారు, తన తోటి వారితో ఇరుగు, పొరుగు వారితో బంధువులతో, అనాధలతో, నిరుపేదలతో ఆయన వ్యవహరించే తీరు ఎలా ఉండేది అని తెలుసుకొని మనము కూడా నడుచుకొనుటకు సాయశక్తుల ప్రయత్నించాలి.

**మీలో ఎవరు అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయత చూపుతారో, సత్కార్యాలు చేస్తారో, ఆమెకు మేము రెట్టింపు ప్రతిఫలం ఇస్తాము. మేము ఆమెకు గౌరవప్రదమైన ఉపాధిని సిద్ధపరచి ఉంచాము.**

*(ఖుర్ ఆన్, 33వ సూర, అల్ అహ్‌జాబ్ 31వ వాక్యం)*

**అల్లాహ్, ఆయన ప్రవక్తా, ఏ విషయంలోనైనా ఒక తీర్పు చేసినప్పుడు విశ్వాసి అయిన ఏ పురుషునికైనా, విశ్వాసురాలైన ఏ స్త్రీకైనా, తరువాత తమ యొక్క ఆ విషయంలో స్వయంగా మళ్ళీ ఒక నిర్ణయం తీసుకునే హక్కులేదు. ఇంకా ఎవడైనా అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు అవిధేయత చూపితే, అతను స్పష్టంగా మార్గభ్రష్టతకు గురి అయినట్లే.**

*(ఖుర్ ఆన్, 33వ సూర, అల్ అహ్‌జాబ్ 36వ వాక్యం)*

**33:36 వ్యాఖ్యానం :** ఈ వాక్యమునకు సూరనిసా 4వ సూర 65వ వాక్యమునకు అతి దగ్గర సంబంధమున్నది. ఇస్లాం ధార్మిక విషయమందు అల్లాహ్ మరియు ప్రవక్త (స.అ.స.) గారి నిర్ణయమే తుది నిర్ణయం. ఏ స్త్రీ, పురుషునికి నిర్ణయాధికారాలు లేవు. ఏవరి అభిప్రాయాలపై నడిచే హక్కు ఎవరికి లేదు. ప్రంపంచం దృష్టిలో అది ఎంత అనుచితంగా ఉన్నాసరే అల్లాహ్ మరియు ప్రవక్త (స.అ.స.) దారి స్వర్గానికి తీసుకుపోతుంది. ఇతరులు చూపిన దారి నరకానికి తీసుకుపోతుంది.

**ఓ ప్రవక్తా! మేము నిన్ను సాక్షిగా చేసి, శుభవార్తను ఇచ్చేవానిగా, హెచ్చరికచేసే వానిగా చేసి అల్లాహ్ అనుమతితో ఆయనవైపునకు పిలుపు ఇచ్చేవానిగా చేసి, ప్రకాశించే దీపంగా చేసి పంపాము. (నిన్ను) విశ్వసించిన మానవులకు శుభవార్త ఇవ్వు వారికి అల్లాహ్ తరపునుండి గొప్ప అనుగ్రహాలు ఉన్నాయని.** ***(ఖుర్ ఆన్, 33వ సూర అహ్జాబ్ 45-46 వ వాక్యం)***

**33:45-46 వ్యాఖ్యానం :** ఈ వచనములో ప్రవక్త (సల్లం) వారి బాధ్యత ఆయన విధి విధానాలను మరియు ఆయన యొక్క ఘనతను తెలియజేయబడింది. నీవు శుభవార్త ఇచ్చెవానిగా అంటే ఎవరు తన బోధనలకు అనుగుణంగా నడుస్తారో వారికి శుభవార్త ఇచ్చేవానిగా ఎవరు దేవునికి ఆయన ప్రవక్తకు వ్యతిరేకంగా నడుచుకుంటే తీవ్రమైన నష్టానికి గురి కావలసి ఉంటుందని హెచ్చరించేవానిగా నిన్ను ప్రకాశించే దీపంగా అంటే 33:21 వచనములో చెప్పబడినట్లు నిన్ను ఓ నమునాగా చేసి పంపాను. ఈ రెండు వచనములది ఒకే భావం వస్తుంది. అంటే ప్రవక్త (సల్లం) వారి జీవితం ఓ ప్రకాశించే దీపం లాంటిది. ఆ దీపం ఆధారంగా మనం నడుచుకుంటే (ఆయన జీవన విధానాన్ని) అనుసరిస్తే మనకు సన్మార్గం లభిస్తుంది. స్వర్గ సుఖాలను పొందుతాము ఆయన మార్గం కాదని ఇతరుల మార్గములో నడిస్తే అంధాకారమే చివరకు లభించేది నరకమే అని స్పష్టమగుచున్నది.

**అల్లాహ్ ఆయన దూతలు దైవప్రవక్తకై "దరూద్" ను పంపుతారు. విశ్వాసులారా! మీరు కూడా ఆయనకై దరూద్ సలామ్‌లు పంపండి.**

***(ఖుర్ ఆన్, 33వ సూర అహ్జాబ్ 56 వ వాక్యం)***

**33:56 వ్యాఖ్యానం :** ఇక్కడ అల్లాహ్ దైవ ప్రవక్తకై దరూర్ పంపడమంటే అల్లాహ్ దైవదూతల సమఖ్యంలో ప్రవక్త యొక్క ఉన్నత స్ధానాన్ని ఆయన యొక్క గొప్ప తనాన్ని తెలపటం. దైవదూతలు దరూద్ పంపడమంటే దైవసన్నిదిలో ప్రవక్తకు ఉన్నతమైన స్ధానాన్ని ప్రసాదించమని దు 'ఆ' ప్రార్ధన చేయుట. (బుఖారి) అలానే విశ్వాసులకు ఆజ్ఞ ఏమనగా ప్రవక్త వారి పేరు విన్నవెంటనే దరూద్ చదువుట. దరూద్ చదవని వాడు పిస్‌నారి (బఖీల్) గా పరిగణించబడును. (బుఖారి, అబుదావూద్, తిర్మజి, నసాయి) హదీసుల ప్రకారం అబుమస్ ఉద్ బదరి సహబి(రజి), సహబీలు

ప్రవక్త (స.అ.స.)తో మాకు సలామ్ పద్ధతి తెలిసింది. దరూద్ ఎలాపంపాలి అని ప్రవక్త (స.అ.స.)తో ప్రశ్నించిరి. దానికి ఆయన (స.అ.స.) అల్లాహుమ్మసల్లె అలామొహమ్మదివ్ వలా ఆలి ముహమ్మదిన్ కమాసలైత అలా ఇబ్రాహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్మజీద్ అల్లాహుమ్మ బారిక్ అలా ముహమ్మదివ్ వల ఆలి ముహమ్మదివ్ కమా, బారక్త అలా ఇబ్రాహీమ వలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్ మజీద్. (బుఖారి)

**వారి ముఖాలను నిప్పులపై అటూ ఇటూ త్రిప్పటం జరిగేనాడు వారు ఇలా అంటారు. "అయ్యో! మేము అల్లాహ్‌కూ దైవప్రవక్తకూ విధేయత చూపి ఉంటే ఎంత బాగుండేది. ఇంకా ఇలా అంటారు "ఓ మా ప్రభూ! మేము మా నాయకులకూ, మా పెద్దలకూ విధేయత చూపాము. వారు మమ్మల్ని ఋజు మార్గం నుండి తప్పించారు. ఓ ప్రభూ! వారికి రెట్టింపు యాతన విధించు. వారిని తీవ్రంగా శపించు." (ఖుర్ ఆన్, 33వ సూర, అల్ అహ్‌జాబ్ 66-68వ వాక్యం)**

**విశ్వాసులారా! అల్లాహ్‌కు భయపడండి, సత్యాన్ని పలకండి. అప్పుడు అల్లాహ్ మీ కర్మలను చక్కబరుస్తాడు, మీ తప్పులను మన్నిస్తాడు. అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకూ విధేయత చూపే వాడు గొప్ప సాఫల్యం పొందుతాడు. (ఖుర్ ఆన్, 33వ సూర, అల్ అహ్‌జాబ్ 70- 71వ వాక్యం)**

**33:70-71 వ్యాఖ్యానం :** విశ్వాసి కేవలం అల్లాహ్‌కు మాత్రమే భయపడాలి. ఎందుకంటే ఆయన సజీవుడు ఎల్లప్పుడు ఉండువాడు. సర్వము చూచువాడు. మనం చీకటిలో ఏకాంతంగా ఏ పని చేసినా బహిరంగంగా ఏ పని చేసినా మన మనస్సులో ఉన్న ఊహలు సహితం ఎరుంగువాడు కాబట్టి.

ఎల్లవేళలా సత్యాన్ని పలకాలి. సత్యానికే తోడ్పడాలి. ఈ గుణం ఉన్నప్పుడు ఏదైనా పొరపాటు జరిగినా అల్లాహ్ మమ్ములను మన్నిస్తాడు.

హదీసు ప్రకారం ఒక మనిషి సత్యం పలుకుతూ జీవితం గడిపినచో అవ్యక్తి సత్యవంతుడని అల్లాహ్ దృష్టిలో లిఖించబడతాడు. (బుఖారి ముస్లిం)

**(ప్రవక్తా!) మేము నిన్ను సర్వమానవులకు శుభవార్తను ఇచ్చేవాడుగా, హెచ్చరిక చేసేవాడుగా నియమించి పంపాము. కాని చాలా మంది మానవులు దీనిని ఎరుగరు.** **(ఖుర్ ఆన్, 34వ సూర, సబా 28వ వాక్యం)**

**34:28 వ్యాఖ్యానం :** ఏవిధంగానైతే ఏకదైవాన్ని విశ్వసిస్తామో అలానే ముహమ్మద్ (స.అ.స). వారు దైవం నిర్ణయించిన సర్వ మానవుల కొరకు అంతిమ ప్రవక్తయని విశ్వశించాలి. ఇలాంటివారికి శుభవార్త స్వర్గమని అవిశ్వాసులకు నరకమని భయపెట్టేవారు ఈ అంతిమ ప్రవక్త. కాబట్టి ఈ విషయాన్ని చాలామందికి తెలియకపోవుట వలన మార్గ భ్రష్టులు అవుతున్నారు.

సూర ఆరాఫ్ 7లో 157 వ వాక్యం సూరపుర్ఖాన్ 1వ వాక్యం మరియు బుఖారి మరియు ముస్లిం హదీసులలో జాబిర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త (స.అ.స.) వారు ఈవిధంగా తెలియజేసారు. ప్రతీ ప్రవక్త తన జాతి లేక ప్రాంతాన్ని వారికి వచ్చేవారు. మరియు నేను (ముహమ్మద్ స.అ.స.) సర్వమానవుల కొరకు పంపబడిన ప్రవక్తను.

ముస్లిం హదీసులో : జాబిర్ (రజి) ఉల్లేఖించారు. ప్రవక్త (స.అ.స.) వారు ఇలా తెలిపిరి. నేను నల్లవారి కొరకు మరియు తెల్లవారి కొరకు ఇలా అందరి కొరకు ప్రవక్తగా పంపబడ్డాను.

**విశ్వాసులారా! మీరు అల్లాహ్‌కు విధేయత చూపండి. ప్రవక్తకు విధేయత చూపండి. మీ పనులను వృధా చేసుకోకండి.**

**(ఖుర్ ఆన్, 47వ సూర, ముహమ్మద్ 33వ వాక్యం)**

**47:33 వ్యాఖ్యానం :** ఈ వాక్యం విశ్వాసులకు బోధిస్తుంది. విధేయత, ఆజ్ఞాపాలన కేవలం అల్లాహ్ మరియు ప్రవక్త వారిద్దై ఉండాలి. వీరిని మాత్రమే అనుసరించాలి. మరి మూడవ పద్ధతి పనికిరాదు. ఏ సత్ కర్మలు చేసినా, మనకు గీటురాయి కేవలం ఖుర్ ఆన్ మరియు హదీసు మాత్రమే.

ఏ ఇమామ్, ముఫ్తి, మసూది అమీర్ ముస్లిమీన్ అను ఇతరుల దారులు పనికిరావు. అలా ఆచరించినచో మీ కర్మలు వృధా అగును.

ఉదా : నమాజ్ పద్ధతి, రోజా పద్దతి, హజ్ మరియు తబ్లీగ్ చేసే పద్దతి మొదలగునవి.

**ప్రవక్తా! మేము నిన్ను సాక్షి (షాహిద్) గాను, శుభవార్త అందజేసేవానిగానూ, హెచ్చరిక చేసేవానిగానూ చేసి పంపాము. ఎందుకంటే, ప్రజలారా! మీరు అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తనూ విశ్వసించాలని, (ప్రవక్తకు) సహకరించాలని అతనిని గౌరవించాలని, ఉదయం సాయంత్రం అల్లాహ్‌ను స్తుతించాలని,**

**ప్రవక్తా! నితో విధేయతా ప్రమాణం చేసినవారు నిజానికి అల్లాహ్‌తో విధేయతా ప్రమాణం చేశారు.**

***(ఖుర్ ఆన్, 48వ సూర, అల్ ఫతహ్ 8-10వ వాక్యం)***

**48 : 8-10 వ్యాఖ్యానం :** (దేవుని) అల్లాహ్ యొక్క ఏకత్వం చాటుటకు ఒక సాక్షిగా అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స.అ.స.) ను అనుసరించాలని, మనసా, వాచ, కర్మనా ప్రజలు ఆయనను మాత్రమే అనుసరించాలని, అలా అనుసరిస్తూ జీవితం గడిపిన వారికి శుభవార్త స్వర్గమని స్వర్గంలో పాల మరియు తేనే, సెలయేర్లు కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. ప్రపంచంలో చూసిన పండ్లను పోలిన పండ్లు లభిస్తాయి గానీ రుచిలో ఏంతో శ్రేష్టమైనవిగా ఉంటాయి.

**అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్తకూ విధేయత చూపే వానిని అల్లాహ్ క్రింద సెలయేర్లు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. విముఖు డయ్యేవానికి ఆయన వ్యధా భరితమైన శిక్ష విధిస్తాడు"**

***(ఖుర్ ఆన్, 48వ సూర, అల్ ఫతహ్ 17వ వాక్యం)***

**విశ్వాసులారా! అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్తకూ ముందు నడవకండి అల్లాహ్‌కు భయపడండి. అల్లాహ్ సమస్తమూ వినేవాడూ, సర్వమూ ఎరిగిన వాడూను.**

**విశ్వాసులారా! మీ కంఠస్వరాన్ని ప్రవక్త కంఠ స్వరం కంటే పెంచకండి. మీరు పరస్పరం మాట్లాడుకునే విధంగా ప్రవక్తతో బిగ్గరగా మాట్లాడకండి, దానివల్ల బహుశా మీరు చేసిన దంతా మీకు తెలియకుండానే వ్యర్థమైపోవచ్చు.**

**ఆసంగతి మీకు తెలియను కూడా తెలియకపోవచ్చు. ప్రవక్త సన్నిధిలో తమ కంఠస్వరాన్ని తగ్గించి మాట్లడేవారి హృదయాలనే వాస్తవానికి భయభక్తుల విషయంలో అల్లాహ్ పరిక్షించాడు. వారికి క్షమాబిక్ష గొప్పప్రతిఫలం లభిస్తాయి.**

**(ఖుర్ ఆన్, 49వ సూర, అల్ హుజురాత్ 1-3వ వాక్యం)**

**49-1-3 వ్యాఖ్యానం :** ఈ వచనము అవతరణకు కారణం బుఖారి హదీసులో అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి) ఉల్లేఖించారు. కొందరు సహబీలు ప్రయాణానికి బయలుదేరుతూ ప్రవక్త వారి వద్దకు వచ్చారు అక్కడే ఉన్న అబుబకర్ (రజి) వారు చొరవ తీసుకొని ఈ ప్రయాణీకులకు నాయకునిగా ఖఅఖాబిన్ ముబద్‌ను నియమించండి అని సలహా ఇచ్చారు. ఇంతలో ఉమర్ (రజి) లేదు లేదు అఖ్‌రాఅబిన్ హాబిస్ ను నాయకునిగా నియమించండి అన్నారు. తమ మాటకు ఉమర్ (రజి) వారు అడ్డు తగులుతున్నారని అబూబకర్ (రజి) భావించి ఉమర్ (రజి) వారితో వాదనకు దిగారు. మీరు నా ప్రతీ మాటకు వ్యతిరేకిస్తారు. నన్ను వ్యతిరేకించడమే నీ పనిగా పెట్టుకున్నావు అన్నారు. ఉమర్ (రజి) నా ఉద్దేశ్యం అది కాదు అని వివరించసాగారు. ఇలా వారిద్దరు మహా ప్రవక్త (సల్లం) ముందే వాదులాడుకోసాగారు. ఆ సమయంలోనే ఈ వచనము అవతరించింది.

హాఫీజ్ ఇబ్నే కసీర్ వారు ఇలా అంటున్నారు. ముస్లిం తను ఏ పని అయినా ప్రారంభించేటందుకు తొందర పడవద్దు అల్లాహ్ మరియు ప్రవక్త వారి ఆజ్ఞ ఏమిటో ముందు తెలుసుకోవడం ఎంతో అవసరం. అలానే ఇబ్నె జరిర్ (రహ) ఇలా అన్నారు ఎవరైతే అల్లాహ్ ఒక్కడే అని విశ్వసిస్తారో ముహమ్మద్ (స.అ.స.) దేవుని యొక్క ప్రవక్త అని నమ్ముచున్నారో వారు ఏ పని అయిన అది ధర్మ యుద్ధం అయిన ఇహలోకపు విషయమైన తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దు అల్లాహ్ మరియు ప్రవక్త వారి బోధనలలో ఏముందో చూడండి. తొందరపడి మీరు తీసుకున్న నిర్ణయం వారి బోధనలకు వ్యతిరేకంగా ఉంటే మీ కర్మలు వృధా అయిపోతాయి.

**....మీరు గనక అల్లాహ్‌పట్ల విధేయతనూ ఆయన ప్రవక్తపట్ల విధేయతనూ పాటిస్తే ఆయన మీ కర్మల ప్రతిఫలాన్ని ఏమాత్రం తగ్గించడు.**

**నిశ్చయంగా అల్లాహ్ అత్యధికంగా మన్నించేవాడు మరియు కరుణించే వాడూను. అసలు అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తనూ విశ్వసించి ఇక ఎలాంటి అనుమానానికి గురికాకుండా, తమ ప్రాణాలతో తమ సిరిసంపదలతో అల్లాహ్ మార్గంలో పోరాడేవారే నిజమైన విశ్వాసులు వారే సత్యసంధులు.**

*(ఖుర్ ఆన్, 49వ సూర హుజురాత్ 14-15వాక్యం)*

**అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తనూ విశ్వసించినవారే తమ ప్రభువు దృష్టిలో సత్యసంధులు (సిద్దీఖ్) మరియు సాక్షులూనూ (షహీద్) వారికి వారి ప్రతిఫలం, వారి జ్యోతి లభిస్తాయి. అవిశ్వాసానికి ఒడిగట్టినవారు. మా వాక్యాలను నిరాకరించినవారు నరకవాసులవుతారు.**

*(ఖుర్ ఆన్, 57వ సూర అల్ హదీద్ 19వాక్యం)*

**57:19 వ్యాఖ్యానం :** అల్లాహ్ దృష్టిలో నిజమైన సత్య సంధులు (సిద్ధిఖ్)లు షహీద్‌లు అవ్వాలంటే వారు తప్పనిసరిగా అల్లాహ్‌పై మరియు ప్రవక్తపై పూర్తి విశ్వాసం కల్గి ఉండాలి. విశ్వాసం కల్గి ఉండటం అంటే దేవుడు ఒక్కడే అని ఆయనను తప్ప మరెవరిని ఆరాధించరాదని ప్రవక్త ముహమ్మద్ (స.అ.స.) వారు దేవుని యొక్క చిట్టచివరి ప్రవక్త ఆయన చూపిన మార్గం ద్వారానే స్వర్గానికి ప్రవేశించే అవకాశం లభిస్తుందని మనస్ఫూర్తిగా నమ్మాలి. అలానే వాక్కుతోను ధృవపరచాలి. ఆచరణ ద్వారా నడుచుకోవాలి. అలాంటి వారికి జ్యోతిని ప్రసాదిస్తాడు. మనం ఇంతకు ముందు చర్చించుకున్న వచనముతో కూడా ముహమ్మద్ (స.అ.స.) వారిని జ్యోతిగా చేసి పంపానని చెప్పడం జరిగింది. దీన్ని బట్టి జ్యోతి అంటే సన్మార్గం అని అర్ధం అల్లాహ్ మరియు ముహమ్మద్ (స.అ.స.) వారి మార్గమే సన్మార్గం వీరి మార్గం కాకుండా వేరే ఎవరి మార్గంను ఎంచుకున్నా అది చూడడానికి ఎంతమంచిగా అనిపించినా అది దేవుని దృష్టిలో సన్మార్గం కాదు అన్నది ఈ వచనము తెలియజేయుచున్నది.

**అతను (ప్రవక్త) తన మనోవాంఛలను అనుసరించి చెప్పడం లేదు. ఇది ఒక వహీ (దైవవాణి) అతనిపై అవతరింపజేయబడుతుంది.**

*(ఖుర్ ఆన్, 53వ సూర, అన్ నజ్మ్ 3-4వ వాక్యం)*

**53:3-4 వ్యాఖ్యానం :** ప్రవక్త ముహమ్మద్ (సల్లం) వారు తన మనోవాంఛలకు అనుగుణంగా ఏదీ చెప్పరు. ఆయన ఏది చెప్పినా అది దైవవాణి ద్వారా ఆయనకు తెలియజేసిన విషయాలేనని ఈ ఖుర్ఆన్ వచనము ద్వారా తెలుస్తుంది. ఇలాంటి విషయాన్నే సూరాయే నిసాలో 113 వచనములో చెప్పబడింది. ఎమిటంటే ఓ ప్రవక్త (స.అ.స.) అల్లాహ్ మీకు గ్రంథాన్ని వివేకాన్ని ఇచ్చాడు అని చెప్పబడింది. అంటే ఖుర్ఆన్‌తో పాటు మరొకటి అని ప్రస్తావించబడింది. అంటే హదీసు గురించి చెప్పిన విషయం అని అర్థం అగుచున్నది ఖుర్ఆన్ మరియు హదీసులు రెండు దైవవాణి ద్వారా వచ్చినవే కావున ప్రతి ముస్లిం ఈ రెండింటిపైన పూర్తి విశ్వాసం కల్గి ఉండాలి.

**మీ ప్రభువు క్షమాభిక్ష వైపునకు పరుగెత్తండి ఒకరి కంటే ఒకరు ముందుకుపోయే కృషి చేయండి. ఆకాశాలంత, భూమియంత విశాలమైన స్వర్గంవైపునకు పరుగెత్తండి. అది అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తలనూ విశ్వసించిన వారి కొరకు సిద్ధం చేయబడింది. ఇది అల్లాహ్ అనుగ్రహం తాను కోరిన వారికి ఆయన దానిని ప్రసాదిస్తాడు. అల్లాహ్ ఎంతో అనుగ్రహం కలవాడు.**

***(ఖుర్ ఆన్ 57వ సూర అల్ హదీద్ 21 వాక్యం)***

**57:21 వ్యాఖ్యానం :** ఆకాశామంత, భూమియంత విశాలమైన స్వర్గం వైపునకు పరుగుత్తెండి అని చెబుతూ అది అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను విశ్వసించిన వారి కొరకు సిద్ధం చేయబడిందిఅని ఈ వాక్యములో చెప్పబడింది. క్షమాభిక్ష పొందాలంటే ప్రవక్తను అనుసరిస్తే ఆయన చూపిన మార్గం ద్వారానే క్షమాభిక్ష పొందగలరన్న విషయం ఈ వచనము ద్వారా విశదమగుచున్నది.

**అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తనూ వ్యతిరేకించేవారు తీవ్రంగా అవమానం పాలు చేయబడతారు, వారికి పూర్వం గతించిన వారు అవమానం పాలు చేయబడిన విధంగా, మేము స్పష్టమైన ఆయతులను (వాక్యాలను) అవతరింపజేశాము. ఇక తిరస్కారులకు తీవ్ర అవమానంతో కూడుకున్న శిక్షపడుతుంది.** ***(ఖుర్ ఆన్, 58వ సూర అల్ ముజాదలహ్ 5వ వాక్యం)***

**నిశ్చయంగా అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తనూ వ్యతిరేకించేవారు నీచాతినీచమైన సృష్టికి చెందినవారు. నేనూ, నా ప్రవక్త మాత్రమే ఆధిక్యం**

**వహించి తీరుతాము అని అల్లాహ్ వ్రాసిపెట్టాడు. నిజానికి అల్లాహ్ సర్వశక్తిమంతుడు, సర్వాధికుడును.**

**అల్లాహ్‌ను, పరలోకాన్ని విశ్వసించేవారు, అల్లాహ్‌ను ఆయన ప్రవక్తనూ వ్యతిరేకించే వారిని ప్రేమించటాన్ని నీవు ఎన్నడూ చూడలేవు. ఆ వ్యతిరేకించేవారు వారి తల్లిదండ్రులైన వారి కుమారులైనా, వారి సోదరులైనా సరే లేదా వారి కుటుంబీకులైన సరే. (ఖుర్ ఆన్, 58వ సూర అల్ ముజాదలహ్ 20-22 వాక్యం)**

**58:20-22 వ్యాఖ్యానం :** ఈ వచనములలో అల్లాహ్‌నూ ఆయన ప్రవక్తను వ్యతిరేకించేవారు నీచాతి నీచమైన సృష్టికి చెందినవారు అని చెప్పబడింది. ఖుర్ఆన్ మరియు హదీస్‌ను వ్యతిరేకించి తమ ఇష్టానుసారం నడుచుకునే వారికి ఈ వచనము వర్తిస్తుంది. ఇంతకుముందు ప్రవక్తలను వ్యతిరేకించి నీచాతి నీచమైన స్థితికి దిగజారారు. ఇకపై కూడా అదే జరుగుతుంది. అది తథ్యం అలాగే పరలోకంలో కూడా కఠినమైన శిక్షకు గురి అవుతారు.

**వారు అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తనూ వ్యతిరేకించినందువల్లనే ఇదంతా జరిగింది. అల్లాహ్‌ను ఎవడు వ్యతిరేకించినా వాడిని అల్లాహ్ చాలా కఠినంగా శిక్షిస్తాడు. (ఖుర్ ఆన్, 59వ సూర, అల్‌హష్ర్ 4వ వాక్యం)**

**దైవప్రవక్త మీకు ఇచ్చిన దాన్ని తీసుకోండి, ఆయన మిమ్మల్ని నిషేధించిన దాని జోలికిపోకండి. అల్లాహ్‌కు భయపడండి. అల్లాహ్ కఠినంగా శిక్షించేవాడు. (ఖుర్ ఆన్, 59వ సూర, అల్‌హష్ర్ 7వ వాక్యం)**

**59:7 వ్యాఖ్యానం :** దైవ ప్రవక్త (స.అ.స) వారు సర్వముస్లింలకు ఇచ్చింది. ఇస్లామియా షరియ్యత్ ఇది ఈ రెండు వస్తువులలోనేఉంది. ఖుర్ ఆన్ మరియు హదీసులు.

**విశ్వసించిన ఓ ప్రజలారా! మిమ్మల్ని వ్యధా భరితమైన శిక్ష నుండి రక్షించే వ్యాపారమేమిటో నేను మీకు తెలుపనా? విశ్వసించండి అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను; పోరాడండి అల్లాహ్ మార్గంలో మీ సంపదలను మీ ప్రాణాలను ధారపోసి, మీరు గనుక గ్రహిస్తే, ఇదే మీకు మేలైనది.**

**(ఖుర్ ఆన్, 61వ సూర, అస్ సఫ 10వ వాక్యం)**

**అల్లాహ్‌కు విధేయత చూపండి, ప్రవక్తకు విధేయత చూపండి. కాని ఒక వేళ మీరు విధేయతకు విముఖులైతే, (తెలుసుకోండి) మా ప్రవక్తపై సత్యాన్ని స్పష్టంగా అందజేసే బాధ్యత తప్ప మరొకటి ఏదీలేదు. ఆయన అల్లాహ్, ఆయన తప్ప మరొక దేవుడు లేడు. కనుక విశ్వాసులు అల్లాహ్‌పైనే ఆధారపడాలి.**

**(ఖుర్ ఆన్, 64వ సూర అత్‌తగాబున్ 12-13 వాక్యం)**

**64:12-13 వ్యాఖ్యానం :** అల్లాహ్ సుబ్‌హనహుతఆలా మానవులకు ఆజ్ఞ ఏమనగా దేవుని ఆజ్ఞాపాలన మరియు ప్రవక్తకు విధేయత చూపాలి. వీటి వల్ల ఇహపరాల సాఫల్యం వీటిపై ఆదారపడి ఉంది. ఒక వేళ వైముఖం చూపినచో నష్టపోయేవారు వీరే ప్రవక్త కేవలం హెచ్చరిక చేసేవాడు మాత్రమే. ప్రస్తుత ముస్లిం సమాజంలో కొంతమంది పెడత్రోవలో నడుస్తున్నారు. వారికి ఖుర్ఆన్ మరియు హదీసులలో గల విషయాలు తెలిపినచో జగడానికి దిగుతారు. నష్టం ఎవరికి? వారికే గదా! అల్లాహ్ మరియు ప్రవక్తను అనుసరించే వారికి పూర్తి నమ్మకం, మరియు భారం అల్లాహ్‌పైనే ఉంచుకోవాలి.

మనం చూస్తున్నాము కొంతమంది ముస్లింలు యా మదద్ యాగౌస్ అని సహాయం కొరకు ఇతరులను పిలుస్తారు. ఇది షిర్క్ అలాంటివి మాని యా అల్లాహ్ అని సహాయం కోరుకోవాలి.

**.......మర్యమ్ కుమారుడు ఈసా అనిన మాటలను జ్ఞాపకం తెచ్చుకో, "ఓ ఇస్రాయీల్ సంతతి వారలారా! నేను మీవద్దకు అల్లాహ్‌చే పంపబడిన సందేశహరుణ్ణి: నాకు పూర్వం వచ్చిన తౌరాత్ గ్రంధాన్ని ధృవపరుస్తున్నాను. నా తరువాత అహ్మద్ అనే ప్రవక్త రాబోతున్నాడు. అనే శుభవార్తను అందజేస్తున్నాను.**

**(ఖుర్ ఆన్, 61వ సూర, అస్ సఫ్ 6వ వాక్యం)**

**61:6 వ్యాఖ్యానం :** ఈ వచనములో ముహమ్మద్ (సల్లం) వారు తనకు తానుగా ప్రవక్తగా ప్రకటించుకోలేదని అంతే కాకుండా ఆయన తెచ్చిన ఇస్లాం ధర్మం కూడా క్రొత్తది కాదని రుజువు అవుతుంది ఈసా (అలై) గూర్చి తౌరాతు గ్రంథములో ముహమ్మద్ (సల్లం) రాక గూర్చి బైబిల్‌లో చెప్పబడింది. ఈ వచనాన్ని యోహాను 16:6, 16:13-14 లో చాలామంది క్రైస్తవులు పఠించి ఇస్లాం ధర్మాన్ని స్వీకరిస్తున్నారు. ఈయన అంతిమ

ప్రవక్త అని ఈయనను అనుసరించుట సర్వమానవాళి యొక్క విధి అయి ఉన్నది.

ఇప్పటివరకు ఖుర్ఆన్‌లో ప్రవక్తను అనుసరిస్తేనే స్వర్గం లభిస్తుందని అల్లాహ్ ప్రేమ పొందాలంటే ముహమ్మద్ (సల్లం) వారి మార్గాన్నే నడవాలని, ప్రేమించాలని ముహమ్మద్ (సల్లం) వారిని అనుసరించాలని ఆయన జీవితాన్ని ఓ నమూనాగా తీసుకొని జీవనం సాగించువారే విశాలమైన స్వర్గంలో స్థానం పొందుతారని తల్లిదండ్రులకన్నా భార్య బిడ్డలకన్నా ఆస్థిపాస్తులకన్నా ఆయన మాటకు విలువనిచ్చిన వాడే నిజమైన ముస్లిం అని, పరిపూర్ణ ముస్లిం కావాలంటే ముహమ్మద్ (సల్లం) వారి పట్ల విధేయత చూపాలని,అవిధేయత కల్గిన వాళ్ళను అల్లాహ్ కఠినంగా శిక్షిస్తాడని వారి పాపాలకు మన్నింపు ఉండదని వారి కర్మలన్నీ వృధా అయిపోతాయని ఖురాన్ ద్వారా తెలుసుకున్నాము. ఈ విషయమై ముహమ్మద్ (సల్లం) వారు ఏమన్నారో చూద్దాం.

మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లం) వారు ఈ విధంగా తెలియజేశారు. ఎవరి ఆధీనంలో నా ప్రాణాలు ఉన్నాయో ఆయన సాక్షి మీలో ఎవ్వరు పరిపూర్ణ ముస్లింలు కాలేరు. ఎప్పటివరకు అంటే మీరు నన్ను మీ తల్లితండ్రులకంటే మీ పిల్లల కంటే ఎక్కువగా ప్రేమించరో అప్పటివరకు (మీరు పరిపూర్ణ ముస్లింలు కాలేరు)(బుఖారి 1 హదీసు 15 పేజి 193)

ముహమ్మద్ (స.అ.స.) వారు ఇలా అన్నారు. ఎవరిలో అయితే ఈ మూడు గుణాలు ఉంటాయో వారు విశ్వాసం యొక్క మాధుర్యాన్ని పొందుతారు. ఒకటి అల్లాహ్ మరియు ప్రవక్తను అందరి కంటే ఎక్కువగా ప్రేమించడం, రెండవది కేవలం దేవుని కోసమే స్నేహం చెయ్యడం, మూడవది విశ్వాసి అయిన తరువాత అవిశ్వాసిగా మారడం అంటే అగ్నిలో పడిపోయినంతగా తలపోయడం. (బుఖారి 1 హదీసు 16 పేజి 194)

మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లం) వారు ఈ విధంగా హెచ్చరించారు. నాపై అసత్యాన్ని మోపకండి. నాపై అసత్యాన్ని మోపేవాడు నరకానికి వెళతాడు. (బుఖారి 1 హదీసు 108వ)

మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లం) వారు ఇలా అన్నారు. ఉద్దేశ్య పూర్వకంగా నాపై అసత్యాన్ని అంటగడతాడో వాడు తన స్థానాన్ని నరకంలో ఏర్పాటు చేసుకున్నట్లే. (బుఖారి హదీస్ )

ముహమ్మద్ (సల్లం) వారు ఇలా అన్నారు. నేను చెప్పలేని విషయాలను నేను చెప్పినట్లుగా ప్రచారం చేయువాడు తన స్థానాన్ని నకరంలో ఏర్పాటు చేసుకున్నట్లే. (బుఖారి)

ముహమ్మద్ (సల్లం) వారు ఈ విధంగా తెలియజేసారు. ఇస్లాంలో లేని కొత్త విధానాలను (పద్ధతులను) ప్రవేశపెట్టుదురో అది ధిక్కరింపబడును. (మర్దూద్). (బుఖారి/ముస్లిం)

ముహమ్మద్ (సల్లం) వారు దేవుని స్తోత్రము చెల్లించిన తరువాత ఇలా అన్నారు. అన్నింటికన్న ఉత్తమమైన వాక్కు దైవ గ్రంథంలోని (వాక్యాలు) అన్ని విధానాలు కంటే శ్రేష్టమైన విధానం (నాది) ముహమ్మద్ (సల్లం) వారు చూపిన విధానం అన్ని పనులకంటే నీచమైన పని ఇస్లాంలో కొత్త విధానాన్ని (బిద్అత్)ని ప్రవేశపెట్టడం ప్రతి కొత్త విధానాన్ని బిదాత్ (దురాచారము)గా పరిగణించబడుతుంది. సమస్త దురాచారాలు మార్గభ్రష్టం వైపునకు నడిపిస్తాయి. మార్గ భ్రష్టులు నరకానికి చేరుకుంటారు. (ముస్లిం)


ముహమ్మద్ (సల్లం) వారు ఇలా అన్నారు. నేను మీలో ఎవ్వరిని ఈ విధంగా చూడకూడదు. ఎలా అంటే పందిరి మంచంపై దిండును అనుకొని నేను బోధించిన బోధనలను నేను అనుమతించిన ధర్మ సమ్మతం చేసిన విషయాలు నేను వారించిన విషయాలు వారికి తెలియజేసినప్పుడు (వినిపించినప్పుడు) వాడు ఇలా అనకూడదు నాకేమి తెలియదు ఏ విషయాలైతే దైవ గ్రంథం (ఖురాన్)లో చెప్పబడిందో వాటిపై మాత్రమే ఆచరిస్తాము అని అనడం (వాదించడం) తగదు.(అబూదావూద్/తిర్మజి)

మహాప్రవక్త (స.అ.స.) ఇలా తెలియజేసారు. నాకు ఖుర్ఆన్‌తో పాటు దానిని పోలినది దానికి తోడుగా (హదీసు) ఇవ్వబడింది జాగ్రత్త! త్వరలో ఓ కడుపు నిండిన వ్యక్తి పందిరి మంచంపై పడుకొని కేవలం ఖురాన్ అనుసరించండి ఏ వస్తువులైతే ఖురాన్‌లో ధర్మ సమ్మతం (హలాల్)

చేయబడిందో వాటినే ధర్మ సమ్మతంగా (హలాల్) భావించండి. మరి వేటినైతే ఖురాన్‌లో నిషేధించబడ్డాయో (హరామ్) వాటిని మాత్రమే నిషిద్ధమైనవి (హరామ్) గా భావించండి అంటాడు. వాస్తవానికి ముహమ్మద్ (సల్లం) వారు నిషేధించినది (అనుమతించనది) దైవాజ్ఞలుగానే భావించాలి.

(అబుదావూద్ III 611 పేజి (తిర్మిజి)

హజరత్ ఇబ్నె మసూద్ (రజి) ఇలా తెలియజేసారు. ఒకసారి ముహమ్మద్ (సల్లం) వారు మాకు వివరించుట కొరకు ఓ తిన్నని గీతగీసారు. పిదప ఇలా అన్నారు ఇది దేవుని యొక్క మార్గం ఆ తరువాత ఆ గీతకు ఇరుప్రక్కల అటు ఇటు గీతలు గీసి ఇలా అన్నారు ఈ ప్రతీ మార్గంలో షైతాను కూర్చుని ఉన్నాడు. ఎవరైతే ఈ మార్గం వైపు వస్తారో వారిని తనవైపునకు పిలుస్తూ ఉంటాడు. తరువాత ప్రవక్త వారు ఖురాన్‌లోని వచనము చదవి వినిపించారు. దాని అర్థం **(అల్లాహ్) నా దారి సరైన దారి దాన్ని అనుసరించండి. చూడండి 8వ పేజీలో 6:153వ వాక్యం)**



మాలిక్ బిన్ అనస్ (రజి) వారు ఈ విధంగా తెలియజేసారు ముహమ్మద్ (సల్లం) వారు ఇలా అన్నారు. నేను మీ మధ్య రెండింటిని వదలి వెళుతున్నాను. ఎప్పటివరకు అయితే మీరు వాటిని గట్టిగా (స్థిరంగా) పట్టుకుంటారో అంతవరకు మీరు మార్గ భ్రష్టులుకారు. దైవగ్రంథం (ఖుర్ఆన్) మరియు ముహమ్మద్ (సల్లం) వారి ప్రవచనాలు (హదీసు)లు

(బుఖారి, ముస్లిం)

ఇస్లాం అంటే ముహమ్మద్ (సల్లం) వారు బోధించిన ధర్మం ఆయనపైనే ఖుర్ఆన్ అవతరించింది. లాఇలాహ ఇల్లల్లాహ ముహమ్మదుర్ రసూలుల్లాహ్ అను కలిమాలోనే ఖుర్ఆన్ హదీసుల ప్రత్యేకత తెలుస్తుంది. అలానే ఖురాన్ యొక్క భావాన్ని గ్రహించాలంటే హదీసు సహాయం ఎంతైనా అవసరం. ఏ వ్యక్తి అయిన నేను ఖురానునే అనుసరిస్తాను అంటే అది సరికాదని ముహమ్మద్ (సల్లం) వారి ద్వారానే చెప్పబడింది. ఒకే దేవున్ని ఆరాధించటం ఎలా అన్నది ముహమ్మద్ (సల్లం) వారి ద్వారానే చెప్పబడింది. ఒకే దేవున్ని ఆరాధించటం ఎంత ముఖ్యమో ముహమ్మద్

(సల్లం) వారిని అనుసరించినప్పుడే సాధ్యపడుతుంది. కానీ నేడు ఇస్లాంలో ఎన్నో బిద్‌ఆత్‌లు (కొత్త పద్ధతులు) ప్రవేశపెట్టబడ్డాయి. ఉదాహరణకు పిల్లవాడు పుట్టిన ఏడవరోజున హఖీఖా చేయ్యాలని హదీసులో చెప్పబడితే మనవాళ్ళు ఛట్టి, ఛిల్లా వంటి కార్యక్రమాలు చేస్తుంటారు. ఇదే విధంగా పెళ్ళిళ్ళలో మరి చెప్పనవసరం లేదు. ఆఖరికి చనిపోయిన వ్యక్తి పేరునుకూడా 3 రోజులు 40 రోజు పిండాకూడు, మొదలగునవి. నమాజులలో బిద్‌ఆత్ జుమా నాడు 2 అజాలు రోజాలలో బిద్‌ఆత్ సమాధి పూజలు తావీజు మంత్రాలు ఇలా ఎన్నో రకరకాల దురాచారాలతో నేటి ముస్లింలు మునిగి ఉన్నారు. దీనికి ముఖ్య కారణం ముహమ్మద్ (సల్లం) వారి బోధనలకు దూరంగా ఉండడం మౌల్విల ఇమాములు మాటలను గ్రుడ్డిగా నమ్మట వలనే.

మనం జీవితంలో చేసే ప్రతి పనికి అలోచిస్తాము. ఏది మంచి, ఏది చెడు అని మరి మన ధర్మ విషయంలో ఎందుకు అశ్రద్ధ వహిస్తున్నాం. మనమందరం ఒకే కలిమా చదివాము. ఒకే ఖిబ్లా వైపునకు తిరిగి నమాజు చదువుతాము. ఒకే గ్రంథాన్ని విశ్వసిస్తాము. ఒకే ప్రవక్త బాటను అనుసరిస్తామని వాగ్దానం చేసియున్నాము. మరి ఆయన మాటలను పెడచెవిన పెడితే ఎలా? ముహమ్మద్ (సల్లం) వారి మార్గాన్ని వదలి వేరే మార్గం ద్వారా దేవుని ప్రేమ పొందడం అనేది అసాధ్యం ముహమ్మద్ (సల్లం) వారి ఆణిముత్యాల్లాంటి మాటలను కొన్నింటిని చూద్దాం.

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు. దైవప్రవక్త (సల్లం) ఇలా బోధించారు. సహజంగా పుట్టిన ప్రతీ పిల్లవాడు ముస్లింగా పుడతాడు. కాని అతని తల్లిదండ్రులే అతనిని యూదునిగా, క్రైస్తవునిగా లేక బహు దైవారాధకునిగా రూపొందిస్తారు. (బుఖారి)

దైవప్రవక్త (సల్లం) ఇలా బోధించారు. ఇస్లాం అయిదు విషయాల మీద ఆధారపడి ఉంది. 1. అల్లాహ్ తప్ప వేరొక దేవుడు లేడని, ముహమ్మద్ (సల్లం) దేవుని ప్రవక్త అని సాక్షం పలకడం. 2. నమాజ్‌ను స్థాపించడం 3. జకాతు నివ్వడం 4. హజ్ యాత్ర చేయడం 5. రమజాన్ మాసంలో రోజాలు పాటించడం. (బుఖారి-1 కితాబుల్ ఈమాన్)

హజ్రత్ జాబిర్ (రజి) ఇలా తెలియజేసారు. ముహమ్మద్ (సల్లం) వారు సమాధిని సున్నంతో వేసి పటిష్టంగా చేయడాన్ని, దానిమీద కూర్చోవడాన్ని, దాని మీద భవనం నిర్మించడాన్ని నిషేధించారు. (ముస్లిం–కితాబుల్ జనాయిజ్)

అబూ అయాజ్ అసదీ, తనకు హజ్రత్ అలీ (రజి) ఇలా తెలిపినట్లు ఉల్లేఖించారు. ముహమ్మద్ (సల్లం) వారు నాతో ఇలా అన్నారు. నన్ను పంపించిన పని కొరకు నేను నిన్ను పంపించనా? ముస్లిముల మధ్య విగ్రహాలుంటే దాన్ని విరగ్గొట్టకుండా, ఎత్తయిన సమాధి ఉంటే దాన్ని నేలమట్టం చేయకుండా వదలకూడదు (ముస్లిం–కితాబుల్ జనాయిజా)

హజ్రత్ అబు–బక్ర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు మహాపాపాల్లో అన్నింటికి మించిన పాపం. దేవునికి సహవర్తుల్ని కల్పించడం తల్లిదండ్రుల పట్ల చెడుగా ప్రవర్తించడం, అబద్ధపు సాక్ష్యం ఇవ్వడం. (బుఖారి – కితాబుల్ ఇస్తితాబుతుల్ ముక్తదీన్)

హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ముహమ్మద్ (సల్లం) ఈ విధంగా అన్నారు ప్రపంచం విశ్వాసికి జైలు వంటిది. తిరస్కారునికి స్వర్గం వంటిది. (ముస్లిం– కితాబుజ్జిహద్)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖించారు. దైవప్రవక్త (సల్లం) నా భుజం పట్టుకొని, లోకంలో నీవు ఒక పరదేశిగా లేక బాటసారిగా జీవించు అని బోధించారు. (బుఖారి–కితాబుర్రిఖాక్)

ముహమ్మద్ (సల్లం) వారు ఇలా బోధించారు. దైవసాక్షిగా! ఓ వ్యక్తి సముద్రంలో వ్రేలు ముంచి తీసి చూస్తే ఎంత నీరు అయితే వ్రేలుకి అంటుకుంటుందో ఇహలోక జీవితం, పరలోక జీవితం ముందు అంతే ఉంటుంది అని అన్నారు. (ముస్లిం కితాబుల్ జన్నత్)

దైవప్రవక్త (సల్లం) వారు లంచం ఇచ్చేవారినీ లంచం పుచ్చుకునేవారినీ – ఉభయుల్నీ శపించారు. (తిర్మజి, కితాబుల్ అహ్కామ్)

దైవప్రవక్త (సల్లం) వారు ఇలా అన్నారు. ఒకవేళ మనిషి వద్ద రెండు లోయలు నిండా ధన సంపత్తి ఉన్నా అతను మూడోది కావాలని కోరుతాడు. మనిషి కడుపును మట్టి మాత్రమే నింపగలదు. దేవుని వైపునకు మరలినవారి వైపునకే దేవుడూ మరులుతాడు. (బుఖారి–కితాబుర్రిఖాక్)

దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు. ఏ వ్యక్తి అన్యాయంగా ఇతరుల భూమిని ఆక్రమించుకుంటాడో అతన్ని ప్రళయ దినాన ఏడు నేల పొరల క్రిందకి త్రొక్కి వేయడం జరుగుతుంది. (బుఖారి–3 కితాబ్ బద్అల్ ఖల్క్)

దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా అన్నారు. మనుషుల్ని చిత్తు చేసేవాడు బలశాలి కాదు. ఆగ్రహ స్థితిలో కూడా తన మనస్సును ఆధీనంలో పెట్టుకునే వాడే వాస్తవానికి శక్తిమంతుడు (బుఖారి ముస్లిం)

ముహమ్మద్ (సల్లం) ఇలా అన్నారు. బంధుత్వపు సంబంధాలను పటిష్ఠం చేసే వ్యక్తి కేవలం ఇతరులు అలా చేసినందుకు తానూ అలా చేస్తే అది సంబంధాల పటిష్ఠత అనిపించుకోదు. తన పట్ల సంబంధాలను తెంచుకునే వారి విషయంలో సంబంధాలను మెరుగుపరిచే వాడే నిజమైన బంధుత్వపు బాధ్యతల్ని నిర్వర్తించేవాడు (బుఖారి)

ముహమ్మద్ (సల్లం) ఇలా అన్నారు. దైవాన్నీ, ప్రళయ దినాన్నీ విశ్వసించే వ్యక్తి సదా మంచి మాటలనే పలకాలి. లేకపోతే మౌనం వహించాలి. దైవాన్నీ అంతిమ దినాన్నీ విశ్వసించే వ్యక్తి తన పొరుగువారికి బాధ కలిగించరాదు. దైవాన్నీ తుది దినాన్ని విశ్వసించే వ్యక్తి తన అతిథిని ఉచిత రీతిన ఆదరించాలి. (బుఖారి)

దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు. శ్రామికుని కూలి అతని చెమట ఆరకమందే చెల్లించండి. (ఇబ్నెమాజ – బాబ్ అజరుల్ అజరా)

ఆదర్శమూర్తి ముహమ్మద్ (సల్లం) ఇలా అన్నారు. నిజమైన సంపదలంటే అధిక ధనం, సాధనా సంపత్తి కాదు. అసలు సంపద హృదయ సంపత్తియే (బుఖారి–కితాబుర్రికాక్)

ముహమ్మద్ (సల్లం) వారు చేసిన ఇలాంటి ఎన్నో బోధనలు నేడు ముస్లింలు మరచిపోయారు. నిజమైన సృష్టికర్తను వదిలి సమాధులను, బాబాలను పూజిస్తున్నారు. కొందరు ముహమ్మద్ (సల్లం) వారు చూపిన విధానానికి వ్యతిరేకంగా ఇమాములు గురువుల విధానాలను అనుసరిస్తున్నారు. మనిషి పుట్టినప్పటి నుండి అతడు ముసలివాడై చనిపోయినంత వరకు ఎదురయ్యే అన్ని విషయాలలో ఎలా ఆచరించాలో మహా ప్రవక్త (సల్లం) కూలంకుషంగా తెలియజేసారు. దేవుని ఆరాధించే విధానం, కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్ళినప్పుడు ఆచరించవలసిన

విధానం,పడుకునే విధానం, భుజించే విధానం, వివాహ సంబంధాలు, వ్యాపార, వాణిజ్య, ఆర్థిక, రాజకీయ, ఆరోగ్య ఇలా అన్ని విషయాలను ఆయన విడమరిచి చెప్పారు.

ఖుర్ఆన్‌లో ముహమ్మద్ (సల్లం) వారిని ఓ నమూనాగా పంపబడ్డారని చెప్పబడింది. అంతే కాకుండా ఆయన విధానం కాకుండా వేరే విధానాన్ని అనుసరించినట్లయితే వారి కర్మలు వృధా అయిపోతాయని హెచ్చరించింది. కాబట్టి ప్రియ సోదర, సోదరీమణులారా! ఇకనైనా మనమందరం ముహమ్మద్ (సల్లం) వారి విధానాన్ని అనుసరిద్దాం. కేవలం ఆరాధన వ్యవహారాలలోనే కాకుండా ప్రతి విషయంలో ఆయన బోధనలకు అనుగుణంగా నడుద్దాం. నడిచే శక్తి అల్లాహ్ మనకు ప్రసాదించాలని మనఃస్ఫూర్తిగా దు“ఆ” చేస్తున్నాను.

ఇంతవరకు ఖుర్ఆన్ మరియు హదీసుల ప్రకారంగా మన జీవితాన్ని గడపాలని మనం చేసే ప్రతి పని ముహమ్మద్ (సల్లం) వారు బోధించిన విధంగా ఉండాలని తెలుసుకున్నాము. మరి ముహమ్మద్ (సల్లం) వారి బోధనలను గుర్తించడం ఎలా? హదీస్ అంటే ఏమిటి? వాటిని ఎలా సేకరించారు? హదీసు గ్రంథాలు ఏమి ఏమి ఉన్నవి. వాటి స్థాయిని ఎలా నిర్ణయించారు. హదీసులను సేకరించువారు ఎవరు ఎవరు ఎన్ని హదీసులను ఉల్లేఖించారు అనే విషయాలను తెలుసుకుందాము.

హదీసు అంటే ఏమిటి?

1. మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లం) వారు బోధించినవి.

2. ఆయన ఆచరించిచూపినవి

3. ముహమ్మద్ (సల్లం) వారి సమక్షంలో సహాబీలు ఏదైన విధానాన్ని ఆచరిస్తే వాటిని సమర్థించినా లేక వారించకపోయినా వాటిని హదీసులు అంటారు. ఈ మూడు రకాల హదీసులు అంటారు. ఈ మూడు రకాల హదీసులను ఖౌలి, ఫేలి, తఖ్‌రిరి అని పిలుస్తారు.

వీటిలో ఖౌలి మొదటి రకం అని చెప్పవచ్చు. ముహమ్మద్ (సల్లం) వారు బోధించినవి ఆయన చేయమని ఆజ్ఞాపించిన వాటిని ఖౌలి హదీసు అంటారు.

రెండవ రకం – ఫేలి. ముహమ్మద్ (సల్లం) ఆచరించినవి ఆయన యొక్క జీవన విధానము పద్ధతిని ఫేలి హదీసు అంటారు.

ఇక మూడవ రకం తఖ్‌రిరి ముహమ్మద్ (సల్లం) వారి సమక్షంలో సహబీలు ఎదైనా విధానాన్ని ఆచరించినప్పుడు వాటిని సమర్ధించి లేక వారించకపోయిన వాటిని తఖ్‌రిరి హదీసులు అంటారు.

ముహమ్మద్ (సల్లం) వారు బోధించిన హదీసులలో హదిసే ఖుదసి, హదిసే నభవి అని రెండు రకాలుగా కూడా విడదీయబడుతుంది.

ముహమ్మద్ (సల్లం) వారి బోధనలు విని వాటిని కంఠస్తం చేసుకొనుట కొందరు సహబీలు మస్జిదే నభవి బయట ఓ అరుగుపై కూర్చుని విని కంఠస్తం చేసుకొని వాటిని ఇతరులకు తెలియజేసేవారు. వీరిని అస్‌హాబే సూఫాగా పిలిచేవారు. సహబే సూఫాహ అంటే అరుగుపై కూర్చున్నవారు అని అర్ధం. సహబీలలో వెయ్యికంటే ఎక్కువ హదీసులు కంఠస్తం చేసి వాటిని ఇతరులకు బోధించినవారు ఉన్నారు. అంతకంటే తక్కువ హదీసులు ఉల్లేఖించిన వారు ఉన్నారు. ఒకటి రెండు హదీసులు ఉల్లేఖించిన వారు ఉన్నారు.

**ఎవరు ఎన్ని హదీసులు ఉల్లేఖించారో ఇప్పుడు చూద్దాం.**

**వెయ్యికంటే ఎక్కువ హదీసులు ఉల్లేఖించిన సహబీలు**

| వ.నెం. | సహబీ పేరు | ఉల్లేఖించిన హదీసులు |
|---|---|---|
| 1. | హజరత్ అబూహురైరా (రజి) | 5374 |
| 2. | హజరత్ అబ్దుల్లాబిన్ అబ్బాస్ (రజి) | 2660 |
| 3. | హజరత్ ఆయిషా (రజి) | 2210 |
| 4. | హజరత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) | 1630 |
| 5. | హజరత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) | 1540 |
| 6. | హజరత్ అనస్ బిన్ మాలిక్ (రజి) | 1286 |
| 7. | హజరత్ అబుసైయిద్ ఖుద్‌రి (రజి) | 1170 |

## వెయ్యికంటే తక్కువ హదీసులు ఉల్లేఖించినవారు

| వ.నెం. | సహాబీ పేరు | ఉల్లేఖించిన హదీసులు |
|---|---|---|
| 1. | హజరత్ అబ్దుల్లాబిన్ మసూద్ (రజి) | 848 |
| 2. | హజరత్ అబ్దుల్లాబిన్ అమర్‌బిన్ ఆస్ (రజి) | 700 |
| 3. | హజరత్ ఆలీ (రజి) | 586 |
| 4. | హజరత్ ఉమర్‌బిన్ ఖత్తాబ్ (రజి) | 539 |

## ఐదు వందలకంటే తుక్కువ హదీసులు ఉల్లేఖించిన వారు

| వ.నెం. | సహాబీ పేరు | ఉల్లేఖించిన హదీసులు |
|---|---|---|
| 1. | ఉమ్మల్ మొమినూన్ ఉమ్మోసలమా (రజి) | 378 |
| 2. | అబూ మూసా అష్‌రి (రజి) | 360 |
| 3. | బరాబిన్ ఆజీబ్ (రజి) | 305 |
| 4. | అబుజర్ గిఫ్పారి (రజి) | 281 |
| 5. | సాద్‌బిన్ అబి వఖ్ఖాసి (రజి) | 215 |
| 6. | సుహేల్‌బిన్ సఅద్ (అన్‌సారి) రజి | 188 |
| 7. | ఉబైదా బిన్ సాబిత్ (రజి) | 181 |
| 8. | అబూ దర్‌దా (రజి) | 179 |
| 9. | అబూ ఖతాద అన్‌సారి (రజి) | 170 |
| 10. | ఉబీబిన్ కాఆబ్ (రజి) | 164 |
| 11. | బురేదాబిన్ ఖసీబ్ ఆస్‌లమీ (రజి) | 164 |
| 12. | మాజ్‌బిన్ జబల్ (రజి) | 157 |
| 13. | అబు అయ్యుబ్ అన్‌సారి (రజి) | 150 |
| 14. | ఉస్మాన్‌బిన్ అఫ్ఫాన్ (రజి) | 146 |
| 15. | జాబిర్ బిన్ సమురా (రజి) | 146 |
| 16. | అబూబకర్ సిద్దిఖ్ (రజి) | 142 |
| 17. | ముగైరాబిన్ షోబా (రజి) | 136 |
| 18. | అబాబకర (రజి) | 130 |

| వ.నెం. | సహాబీ పేరు | ఉల్లేఖించిన హదీసులు |
|---|---|---|
| 19. | ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) | 130 |
| 20. | మావియాబిన్ అబుసుఫ్యాన్ (రజి) | 130 |
| 21. | సోబాన్ (రజి) | 127 |
| 22. | ఉసామాబిన్ జైయిద్ (రజి) | 128 |
| 23. | నోమాన్ బిన్ బషీర్ (రజి) | 124 |
| 24. | సమూరాబిన్ జున్‌దబ్ ఫజారి (రజి) | 123 |
| 25. | అబూమసూద్ ఉఖ్‌బాబిన్ ఉమర్ (రజి) | 102 |
| 26. | జరీర్‌బిన్ అబ్దుల్లా (రజి) | 100 |

వీరే కాకుండా వందకు తక్కువ హదీసులు ఉల్లేఖించినవారు ఉన్నారు వీరంతా ముహమ్మద్ (సల్లం) వారిని ప్రత్యక్షంగా చూసి ఆయన సమక్షంలో ఇస్లాంను స్వీకరించిన వారు.

హదీసులను సమకూర్చి పుస్తక రూపముగా

మొట్టమొదట వ్రాసిన వారు అబ్దుల్లాబిన్ అమర్ బిన్ ఆస్ (రజి) వారు ఈయన వ్రాసిన పుస్తకములో 700 హదీసులు ఉన్నాయి. ఈ పుస్తకము పేరు "అల్‌సాదిఖా" ఈ పుస్తకమును ముహమ్మద్ (సల్లం) వారి జీవితకాలంలోనే వ్రాయబడింది.

ఆ తరువాత ఇమామ్ మాలిక్ బిన్ అనస్ (రహ) వారు కొన్ని హదీసులను సమకూర్చి ముతా అను హదీసు పుస్తకము వ్రాసారు. ఈయన హిజిరి 95 సం॥ జన్మించారు. హిజిరి 178 సం॥లో స్వర్గస్తులైనారు.

ఆ తరువాత కాలంలో ఇమామ్ షాఫీ (రహ) ఈయన గారి అసలు పేరు అబూ అబ్దుల్లా బిన్ ముహమ్మద్ ఇద్రీస్ ఈయన హిజిరి 150 సం॥లో జన్మించారు. హిజిరి 204 సం॥ స్వర్గస్తులైనారు. ఇమామ్ షాపీ (రహ) వారు వ్రాసిన పుస్తకములలో ప్రసిద్ధిగాంచిన పుస్తకము కితాబుల్ ఉమ్మ్ ఇదే కాకుండా ఈయన మరికొన్ని పుస్తకములు కూడా వ్రాసారు. కితాబుల్ బోగ్దాది, రిసాలా ఖదిమియా వజదీదియా, ఎక్త్ లాఫుల్ హదీస్, కితాబుల్ సునూన్ ఎహ్‌కాముల్ ఖుర్‌ఆన్ మొదలగునవి.

షాఫి (రహ) తరువాత కాలంలో వచ్చినవారు ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ) ఈయన హిజిరి 164 సం॥ జన్మించారు. హిజిరి 241 సం॥లో స్వర్గస్తులైనారు. ఈయన తన జీవితకాలంలో చాలా ప్రాంతాలు తిరిగి హదీసులను సేకరించారు ఆయన మసనద్ అహ్మద్ అను హదీసు గ్రంథాన్ని వ్రాసారు. ఈయన సేకరించిన హదీసు ఎక్కడ నుండి ఎవరి ద్వారా హదీసు లభ్యమైనది ఈయనతో హదీసు వివరించిన వారు ఎవరు ఆయన ఈ హదీసు ఎలా తెలుసుకున్నారు అన్న విషయాలన్నీ ఇందులో పొందుపరిచారు. హంబల్ (రహ) రమారమి 10 లక్షల హదీసులను సేకరించారు. ఈయన వ్రాసిన మసనద్ అహ్మద్‌లో 30 వేల హదీసులు ఉన్నాయి. ఈ పుస్తకాన్ని ఈయన జీవితకాలంలో పూర్తి చేసి ప్రచురించలేక పోయారు. హ॥ హంబల్ వారు మరికొన్ని పుస్తకములు కూడా వ్రాసారు. ఖుర్ఆన్ తఫ్‌సీర్, నాసిఖ్‌మన్‌సూఖ్ కీతాబ్ హదీస్ సిబా, కితాబ్ ఫజాయిల్ అబూబకర్‌సిద్దీక్ కితాబ్ ఫ జాయిల్ హుసైన్, కితాబ్ తారీఖ్ రిసాలా సలాత్ మొదలగునవి.

ఈయన గారి కాలంలో ఓ (ఫిత్‌నా) ఉపద్రవం ప్రారంభమైనది అది ఏమిటంటే ఖుర్ఆన్ దేవుని యొక్క సృష్టిలో ఒకటని దేవుని సృష్టిలో ఒక భాగం మని వాదించేవారు పుట్టుకొచ్చారు. ఇలాంటి వారి వాదనను రాజ్యాధికారం కూడా సమర్ధించింది ఈ వాదనను హంబల్ (రహ) వారు వ్యతిరేకించారు ఖుర్ఆన్ దేవుని యొక్క వాక్కు అని చాటి చెప్పారు. ఇలా చెప్పినందుకు హ॥ హంబల్ (రహ) వారిని చెరసాలలో నిర్భందిచారు. ఆయనను తీవ్రంగా హింసిచారు. ఎలా చెప్పబడుతుందంటే ఆయన తీవ్రంగా కొట్టడం వలన ఆయన యొక్క రెండు చేతులు చచ్చుబడి పోయాయి.

అందుచేత ఆయన నమాజు చదివేటప్పుడు చేతులు కట్టుకోవటానికి వీలులేకుండా పోయింది. ఎన్ని విధాలుగా వారు హింసించినా హంబల్ (రహ) వారు అసత్య విధానానికి ఎదురొడ్డి నిలుచున్నారు. హ॥ హంబల్ (రహ) వారి తరువాత ప్రసిద్ధిగాంచినవారు ఇమామ్ బుఖారి (రహ) ఈయన పూర్తి పేరు అబూ అబ్దుల్లాబిన్ ఇస్మాయిల్ బుఖారి ఈయన

హిజిరి 194 సం॥ జన్మించారు. హిజిరి 256 సం॥ మరణించారు. బుఖారి (రహ) వారు మొత్తం 6 లక్షల హదీసులను సేకరించారు. వాటిలో కేవలం 7,275 హదీసులను మాత్రమే సత్యమైనవిగా పరిగణించారు. వాటిని మాత్రమే తను వ్రాసిన బుఖారి గ్రంథంలో పొందుపరిచారు. హదీస్‌పై చిన్నపాటి అనుమానం కల్గినా అలాంటి హదీసును బుఖారి గ్రంథంలో వ్రాయటానికి ఇష్టపడలేదు. బుఖారి (రహ) వారు 10 సం॥ వయస్సులోనే హదీసుల గూర్చి తెలుసుకోవడం మొదలుపెట్టారు. ఈయన హదీసులను సేకరించడం కోసం హదీసును ఉల్లేఖించినవారిని కలవటం కోసం వారు ఎంత దూరంలో ఉన్నా అక్కడికి వెళ్ళి కలుసుకోని వారి నుండి హదీసు సేకరించినవారు బుఖారి 18 ఏటలోనే మదీనా వెళ్ళారు. మదీనాలో కితాబుల్ తారిఖ్ అను పుస్తకము వ్రాయటానికి రాత్రులు వెన్నెల వెలుగులో కూర్చుని వ్రాసేవారు. బుఖారి (రహ) వారు సహి హదీసును గుర్తించి అది వ్రాసే ప్రతిసారి రెండు రకాతులు నమాజు చదివి హదీసు వ్రాసేవారు. బుఖారి గ్రంథం వ్రాయటానికి 16 సం॥ కాలం పట్టింది. బుఖారి (రహ) వారి కలలో ముహమ్మద్ (సల్లం) వారు కనిపించి ఒక తూనిక ఇచ్చారు. దీని భావం ఎమిటంటే బుఖారి (రహ) ఖచ్చితమైన ప్రమాణాలతో కూడుకున్న హదీసులను సేకరిస్తారని బుఖారి (రహ) వారు మొత్తం 22 పుస్తకాలు వ్రాసారు. తారీఖుల్ కబీర్ అనే పుస్తకాన్ని ఈయన తన 18వ ఏటనే వ్రాయటం మొదలుపెట్టారు 2. తారీఖ్ సగీర్ 3. తారిఖే అఉస్త్ 4. అల్‌జామియల్ ఖబీర్ 5. ఇస్లామి సహబా 6. ఖాతాబ్ అలల్ 7. అల్ అదబల్ మజూర్ ఈనాడు జయిప్, సహి హదీసులను గుర్తించడం జరుగుతుందంటే జయిఫ్ గుర్తించడానికి బుఖారి (రహ) వారు వ్రాసిన పుస్తకాల ఆధారం లేకుండా వ్రాయలేదన్నది వాస్తవం. అసహబీల జీవిత చరిత్ర అనగా ఏ సం॥ పుట్టిరి, ఏ సం॥లో స్వర్గస్తులైరి వారి జీవితకాలం నుండి హదీస్‌కు పోల్చుకోవచ్చు.

ఇమామ్ ముస్లిం (రహ) ఈయన పూర్తి పేరు ముస్లింబిన్ హజ్జాజ్ బిన్ వర్ధ కోషాజ్ ఈయన హిజిరి 204 సం॥లో జన్మించారు. హిజిరి 261 సం॥లో మరణించారు. ఈయన వ్రాసిన ముస్లిం గ్రంథంలో

హదీసులు, ఆసారులు కలిసి 7422 ఉన్నాయి. ముస్లిం గ్రంథంలో ఉన్న హదీసులన్నీ సహి హదీసులుగా పరిగణించబడతాయి.

ఇమామ్ అబూదావూద్ (రహ) ఈయన పూర్తి పేరు సులైమాన్‌బిన్ అల్‌షాష్ ఈయన హిజిరి 202 సం॥ జన్మించారు. హిజిరి 275 సం॥ స్వర్గస్తులైనారు. ఈయన వ్రాసిన అబూదావూద్ గ్రంథంలో ఆసారులు కలిసి 4800 ఉన్నాయి. ఈ గ్రంథంలో సహి హదీసులతో పాటు కొన్ని జయిఫ్ హదీసులు కూడా ఉన్నట్లు గుర్తించడం జరిగింది.

ఇమామ్ నసాయి (రహ) ఈయన పూర్తి పేరు అహ్మద్ బిన్ సోయాజ్ బిన్ అలీ, నసాయి అనునది ఆయన యొక్క ఊరి పేరు. ఈయన హిజిరి 215 సం॥ జన్మించారు. హిజిరి 303 సం॥ స్వర్గస్తులైరి. నసాయి గ్రంథంలో హదీసులు ఆసారులు కలిసి 5764 ఉన్నాయి. ఇందులో సహి హదీసులతో పాటు జయిఫ్ హదీసులు కూడా ఉన్నట్లు గుర్తించారు.

ఇమామ్ తిర్మిజి (రహ) వారి పూర్తి పేరు అబూ ఈషా ముహమ్మద్ బిన్ ఈషా బిన్ సూరా బిన్ మూసా అల్ సహాఖ్ తిర్మిజి.

తిర్మిజి అనునది ఆయన ఊరిపేరు ఆయన హిజిరి 209 సం॥ జన్మించారు. హిజిరి 279 సం॥లో మరణించారు. ఈయన వ్రాసిన తిర్మిజి గ్రంథంలో హదీసులు కలసి ఉన్నాయి. తిర్మిజి గ్రంథంలో కూడా సహి హదీసులతో పాటు జయిఫ్ హదీసులు కూడా ఉన్నట్లు గుర్తించడం జరిగింది. తిర్మిజి గ్రంథంలో ఉన్న హదీసులు గమనించినట్లైతే ఎక్కువ హదీసులు మహా ప్రవక్త (సల్లం) వారు తినే త్రాగే విధానాలు మరియు వస్త్రాధారణ అలానే ఇతరులతో మెలిగే విధానము మరియు ప్రవక్త (సల్లం) వారి జీవన సరళి మొదలగునవి కానవస్తాయి.

ఇమామ్ ఇబ్నెమాజా (రహ) ఈయన పూర్తి పేరు

హాఫీజ్ అబూ అబ్దుల్ ఈయన పూర్తి పేరు హాఫీజ్ అబూ అబ్దుల్ ముహమ్మద్ బిన్ యజీద్ ఇబ్నెమాజా ఈయన ఇరాన్‌లో హిజ్రి 209 సం॥లో జన్మించారు. హిజ్రి 279లో మరణించారు. ఈయన తల్లిగారి పేరు మాజా అందువలన ఈయనకు ఇబ్నెమాజా అని పిలిచేవారు.

2. ఇబ్నెమాజా (రహ) హదీసులు సేకరించడానికి చాలా దూరం ప్రయాణించారు. ఈయన 4000 హదీసులు సేకరించారు. ఇందులో సునాన్ 1500 హదీసులు ఉన్నాయి. ఈయన 32 పుస్తకముల వరకు వ్రాసారు. ఇబ్నెమాజా గ్రంథంలో మున్కిర్, మౌజు, హదీసులు ఉన్నట్లు విద్వాంసులు నిర్ధారించారు. అందువలన ఇబ్నెమాజాను కుతబెసత్తాలో చేర్చలేదు.

ఇమామ్ బహఖీ ఈయన పూర్తి పేరు అబూబకర్ బిన్ అహమ్మద్ బిన్ హుసైన్ అల్ బహఖీ బహఖీ అనునది ఊరి పేరు. ఈయన హిజరి 384 సం॥లో జన్మించారు. హిజిరి 458 సం॥లో మరణించారు. ఈయన రమారమి 1000 హదీసుల వరకు సేకరించారు.

వీరే కాకుండా చాలామంది విద్వాంసులు వచ్చారు. కొందరు ఈ హదీసులపై పరిశోధనలు చేసి వాటికి సహి, హసన్, జఈఫ్, సునాన్, మరూపూ, మౌఖుఫ్, ముర్సల్, మున్కిర్, మౌజులుగా విడదీసారు. బుఖారి మరియు ముస్లిం గ్రంధాలలో ఉన్న హదీసులు తప్ప అన్ని మిగిలిన గ్రంధాలలో సహి హదీసులతోపాటు జఈఫ్ హదీసులు కూడా ఉన్నాయని గుర్తించారు. వాటిని ఉల్లేఖించిన వారు.

వివరాలను బట్టి విడదీసారు బుఖారి (రహ) వ్రాసిన అస్మాయే రజ్జాల్ అను పుస్తకము ఆధారంగానే ఇది సాధ్యం అయినట్లు చెప్పబడుతుంది. హదీసులను ఎలా విడదీసారో ఒకసారి చూద్దాం.

**1. సహి హదీసు :** హదీసును ఉల్లేఖించే వారి యొక్క వివరణ లేక ఆధారాలు సరైనది అయి ఉండి అలానే హదీసును ఉల్లేఖించినవారు సత్యవంతులై ఉండటం మరియు వారిపై ఎలాంటి ఆరోపణలు లేకుండా ఉండటం మరియు పరిపూర్ణమైన జ్ఞాపకశక్తి కలవారై ఉండటం అంటే ప్రవక్త (సల్లం) వారి నుండి విన్నది విన్నట్టు చెప్పే సామర్ధ్యం కలిగి ఉన్నవారు పై చెప్పబడిన క్వాలిటీ కల్గినవారు ఉల్లేఖించిన హదీసులను సహి హదీసులుగా పరిగణించబడినాయి.

**2. హసన్ హదీసు :** హదీసును ఉల్లేఖించిన వారి యొక్క వివరణ లేక ఆధారాలు సరి అయి ఉండి హదీసు ఉల్లేఖించేవారు సత్యవంతులై ఉండి మరియు వారిపై ఎలాంటి ఆరోపణలు లేకుండా ఉన్నవారై ఉన్నప్పటికి

వారి జ్ఞాపకశక్తి తక్కువగల వారిగా గుర్తించినా లేకవారు హదీసుని ఉల్లేఖించే సమయంలో వారి జ్ఞాపకశక్తి సన్నగిల్లినట్లు అనిపించినా అలాంటి వారు ఉల్లేఖించిన హదీసులను హసన్ హదీసులుగా పరిగణించబడినాయి.

**జఈఫ్ హదీసులు :** హదీసును ఉల్లేఖించిన వారి యొక్క ఆధారాలు సరిగ్గా లేకపోవడం అలానే హదీసు ఉల్లేఖించిన వారికి సరైన జ్ఞాపక శక్తి విషయపరిజ్ఞానము లేకపోవడం వంటివి హదీసుని ఉల్లేఖించిన వారిలో కనిపించినట్లయితే అలాంటి హదీసులను జఈఫ్ హదీసులుగా పరిగణించబడతాయి.

సహిహీన్ హదీసులు బుఖారి మరియు ముస్లింలలో ఉన్న ఒకే విధమైన హదీసులను సహిహీన్ హదీసులుగా పరిగణించబడతాయి ఎందువలన అంటే బుఖారి మరియు ముస్లిం గ్రంధాలలో ఉన్న మొత్తం హదీసులు సహి హదీసులుగా గుర్తించడం జరిగింది. అందుచేతనే ఒకే విధమైన హదీసు రెండు గ్రంధాలలో ఉన్నా అలాంటి హదీసును సహిహీన్ హదీసులుగా పరిగణించబడతాయి.

సునన్ హదీసులు ముహమ్మద్ (సల్లం) వారు ఇలా చెయ్యండి అని అజ్ఞాపించిన హదీసులను సునన్ హదీసులుగా పరిగణిస్తారు. ఇలాంటి హదీసులు ఉన్న గ్రంధాలు ఇవి సునన్ నిసాయి, సునన్ ఇబ్నెమాజా సునన్ అబూదావుద్ మొదలగున్నవి సునూన్ తిర్మజి.

**మర్ఫూ హదీసు :** హదీసును ఉల్లేఖించిన వారి యొక్క (కడి) లింక్ సరిగ్గా లేకపోవటం కేవలం ముహమ్మద్ (సల్లం) వారు చెప్పారు అని మాత్రమే ఉంటే అలాంటి హదీసును మర్ఫూ హదీసుగా పరిగణిస్తారు.

(కడి అంటే హదీసులు గ్రంథంగా వ్రాసేనాటికి రెండు మూడు తరాలు గడచిపోయాయి. అందువలన హదీసు గ్రంథం వ్రాసేవారికి మరియు ముహమ్మద్ (సల్లం) వారికి మధ్య గడచిన వారి యొక్క వివరణ ఖచ్చితంగా ఉందా లేదా అని గుర్తించడాన్ని కడి అంటారు.

ఉదా: అబూదావూద్ (రహ) ఓ హదీసు వ్రాసారనుకోండి ఈయన వ్రాసిన హదీసు ఎవరి వద్ద సేకరించారో వ్రాసారు. అలానే ఆ హదీసు ఆయనకు ఎలా తెలిసింది ఎవరి ద్వారా తెలిసిందో కూడా తెలియజేస్తారు

ఇలా ఆ ముందు తరంవారి నుండి ఎలా తెలుసుకున్నారు. అసలు ముహమ్మద్ (సల్లం) నుండి హదీసులను విన్న వ్యక్తికి ఆయన కాలం నాటివాడు కాదా అన్న విషయాలను సేకరించి నిర్ణయించడాన్నే కడి అంటారు. హదీసులపై పరిశోధన చేసినవారు ఈ లింక్‌పై పరిశోధన చేసి వివరాలు సరిగ్గాలేని హదీసులను మర్‌ఫూ హదీసులుగా గుర్తించడం జరిగింది.

మౌఖుఫ్ హదీసు పై హదీసులలో ఎలా అయితే హదీసును ఉల్లేఖించిన వారి యొక్క కడి (లింక్) సరిగ్గా లేకపోవడం ఫలానా సహబీ ఇలా ఉల్లేఖించారు అని చెప్పబడే హదీసులను మౌఖుఫ్ హదీసులుగా పరిగణిస్తారు.

**ముర్‌సల్ హదీసు :** ఇది జఈఫ్ హదీసులో ఒక రకం ఈ హదీసు ఉల్లేఖించిన వారిలో తాబేయిన్ మరియు సహబీల వివరాలు లేకుండా నేరుగా ముహమ్మద్ (సల్లం) నుండి విన్నట్లు చెప్పే హదీసులను ముర్‌సల్ హదీసు అంటారు.

(ఇక్కడ ఒక విషయం చెప్పాలి అది ఏమిటంటే) ముహమ్మద్ (సల్లం) వారి జీవితకాలంలో ఆయన సమక్షంలో ఇస్లాంను స్వీకరించిన వారి సహబీలు అంటారు వారి తరువాత కాలం వారిని తాబెయిన్ అంటారు. వారి తరువాత వారిని తబెతాబెయిన్ అంటారు.

ముహమ్మద్ (సల్లం) వారి నుండి ఒక హదీసు సహబీ తెలుసుకుంటారు. సహబీ ద్వారా తాబెయిన్ తెలుసుకుంటారు. తాబెయిన్ ద్వారా తబి తాబెయిన్‌కు చేరుకుంటుంది. తబి తాబెయిన్ ద్వారా ఆ తరువాత వారికి ఇలా హదీసును ఉల్లేఖించిన వారికి ముహమ్మద్ (సల్లం) వారికి మధ్య గడచినవారి యొక్క వివరణననే విద్వాంసులు హదీసులను విడదీయడం జరిగింది.

మున్‌కిర్ హదీసు ఇది కూడా జఈఫ్ హదీసు. ఈ హదీసును ఉల్లేఖించిన వారిలో అసత్యవాది లేక బిదఆతి లేక తప్పుడు పనులు చేయువాడు మరియు జ్ఞాపకశక్తిలో లోపము కలవాడై ఉండటం ఇలాంటి

లోపాలు ఉన్నట్లు గుర్తించి ఇలాంటి హదీసులను మున్కిర్ హదీసు అంటారు.

మౌజుహదీసు : ఇది జఈఫ్‌లో ఒక రకం. ఓ వ్యక్తి తన తరుపు నుండి ఏదో చెప్పి అది ముహమ్మద్ (సల్లం) వారు బోధించారని చెప్పిన హదీసునే మౌజు హదీసులు అంటారు.

ఈ క్రింద కొన్ని జఈఫ్ హదీసులను గమనించండి. ఈ హదీసులు ఆచరణ యోగ్యం కానివి అయిన వీటిని గుడ్డిగా ఆచరిస్తారు. ఉదా: కొన్ని చూద్దాం :

1. ఎవరైతే వజూ చేయునప్పుడు తల మసాతో పాటు మెడ వెనుక భాగం మసా చేసినట్లు అయితే తీర్పు దినంనాడు మెడకు వ్రేళాడదీసే బరువైన బండ వ్రేలాడకట్టే శిక్ష నుండి రక్షింపబడతారు.

ఈ హదీసు బాతిల్ హదీసుగా గుర్తించడం జరిగింది. బాతిల్ అంటే అసత్యపు హదీసు అని అర్థం. ముహమ్మద్ (సల్లం) వారు వజూలో మెడను తడి చేతులతో తుడుచుకున్నట్లు ఎలాంటి ఆధారాలు లేవు కాని కొందరు దీనిని చేర్చినారు. ఈ విషయం తెలియక వజూ చేసినప్పుడు గర్దన్‌కామసా చేస్తూ ఉంటారు.

ఇలాంటి మరో హదీసు చూద్దాం.

మీరు వజూ చేసిన అనంతరం చివరిలో మీరు మర్మాంగ ప్రదేశముపై నీళ్ళు చిలకరించండి.

ఈ హదీసు జఈఫ్‌గా గుర్తించడం జరిగింది.

మరో హదీసు చూద్దాం

బిలాల్ (రజి) వారు అఖామత్ ఇవ్వడానికి నిశ్చయించుకున్నప్పుడు అస్సలాము అలైకుం యా అయ్యు అన్ నబియ్యు అనేవారు.

ఈ హదీసు బాతిల్‌గా మున్కిర్, మన్ఘుడత్‌గా గుర్తించబడింది. ఇటువంటి హదీసుపై ఆచరించడం మహాపాపం. బిద్అత్‌గా పరిగణించ బడుతుంది. గుడ్డిగా ఇలాంటి వాటిపై నేడు ఆచరిస్తున్నారు. అల్లాహ్ మనలను ఇలాంటి వాటి నుండి కాపాడుగాక. ఆమీన్.

# మా పుస్తకములు

| | | | రూ॥లు |
|---|---|---|---|
| 1. | దేవునితో సాటి కల్పించుట మహాపాపం (తెలుగు) | ....... | 12 |
| 2. | Prophet Muhammed (S.A.W.S's) Namaz (Eng.) | ...... | 10 |
| 3. | ప్రవక్త (స.అ.స.) వారి నమాజ్ పద్ధతి (తెలుగు) | ...... | 10 |
| 4. | విశ్వప్రవక్తల దు“ఆ”లు (తెలుగు) | ...... | 10 |
| 5. | నమాజెనబవి (స.అ.స.) (తెలుగు లిపి-ఉర్దూ) | ...... | 10 |
| 6. | ఇస్లాంపై ముస్లిమేతరుల కొన్ని ప్రశ్నలకు జవాబులు | ...... | 12 |
| 7. | నమాజె నబవి (స.అ.స.) (హిందీ) | ...... | 10 |
| 8. | Universal Prophets Prayers (Eng.) | ...... | 10 |
| 9. | ప్రవక్త మొహమ్మద్ (స.అ.స.) బాట స్వర్గానికి బాట (తెలుగు) | ...... | |
| 10. | ఖుర్ఆన్ మరియు సైన్స్ | ...... | 35 |
| 11. | ముస్లిం జీవనసరళి | ...... | 10 |
| 12. | ఇస్లాం ప్రియ బోధనలు | ...... | 12 |
| 13. | Association of Partners to Allah is Greatest Sin | ...... | |
| 14. | వీరే స్వర్గవాసులు (తెలుగు) | ...... | |
| 15. | ఇస్లామియా నెలలు ఆచారాలు, దురాచారాలు | ...... | |
| 16. | సనాతన ధర్మం ఇస్లాం మాత్రమే | ...... | |

**Rs. 15/-**

3000 కాపీలు (2008)


رسول اللہ ﷺ کا راستہ ہی جنت کا راستہ ہے۔ (سنگو)























JAMIATH SHUBBAN AHL-E-HADEES

QURAAN HADEES

ABOOSARANG STREET, VIZAG-1, AP, INDIA

